
ఉష్ణోగ్రత బుధవారం గరిష్ఠం : 32.0 కనిష్ఠం : 17.0

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



అనంతపురం

జిల్లా వార్తలు

గురువారం 20 నవంబరు 2025



"విశ్వప్రేమకు ప్రతిరూపం భగవాన్ సత్యసాయిబాబా. సమాజం, ప్రజలను ఆదుకోవడానికి సత్యసాయి నిరంతరం తపించారు. సేవే పరమ ధర్మమని బాబా చేసిన బోధనలే లక్షల మందికి మార్గం చూపాయి. లవ్ ఆల్... సర్వ్ ఆల్ అని బాబా బోధించారు. ఆయనతో పాటు ఆయన సంస్థలూ అదే పాటిస్తూ వస్తున్నాయి. మానవ సేవే మాధవ సేవ అని భావించి, ప్రపంచ వ్యాప్తంగా సేవ చేస్తున్నాయి. ఎక్కడ ప్రకృతి వైపరీత్యం వచ్చినా సత్యసాయి సేవాదళ్ వాలిపోతోంది. తాగునీరు, వైద్యం, విద్య, విపత్తు నిర్వహణ వంటి బాబా సేవలు అనిర్వచనీయం. భగవాన్ సత్యసాయి శతజయంతి ఉత్సవాలను జరుపుకోవడం ఓ వరం. శత జయంతి ఉత్సవాల్లో పాల్గొనడం నా అదృష్టం.

- ప్రధాని నరేంద్ర మోదీ



సత్యసాయి వంద రూపాయల నాణేలను ఆవిష్కరిస్తున్న ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబు తదితరులు

విశ్వప్రేమికుడి వేడుక




పర్తికి తరలివచ్చిన భక్తజనం

హిల్ వ్యూ స్టేడియంలో సందడి

- సత్యసాయి సేవలను కొనియాడిన ప్రధాని మోదీ
- సత్యసాయి స్మారక నాణేలు, తపాలా బిల్లల ఆవిష్కరణ
- 'సుకన్య సమృద్ధి యోజన' పథకాన్ని ప్రారంభించిన ప్రధాని
- సెంట్రల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో రైతులకు గిర్ గోవుల బహూకరణ
- సత్యసాయితో బంధాన్ని గుర్తు చేసుకున్న సీఎం చంద్రబాబు

"ఈ భూమిపై మనం చూసిన దైవ స్వరూపం భగవాన్ సత్యసాయిబాబా. ప్రేమ, సేవ, ప్రశాంతతకు ఆయన ప్రతిరూపం. విశ్వశాంతి, విశ్వ సౌభాగ్యం, సకల జనుల సంతోషం అనే భావనతో ఆయన జీవించారు. ఆయన నడిచిన ఈ పుణ్యభూమిలో శతజయంతి వేడుకలు జరుపుకుంటున్నాం. ప్రేమ ఒక్కటే మతం... హృదయం ఒక్కటే భాష.. మానవత్వమే కులం... అన్ని చోట్లా దైవం ఉన్నారని ఆయన బోధించారు. నాస్తికుల్ని సైతం ఆధ్యాత్మికత వైపు నడిపించిన గొప్ప వ్యక్తి బాబా. బాబాతో నాకు ఎన్నో జ్ఞాపకాలు ఉన్నాయి. ట్రస్ట్ కార్యక్రమాలపై పలుమార్లు నాతో చర్చించారు. ఆయన సేవలే స్ఫూర్తిగా మానవాళికి అందరూ ఉపయోగపడాలి."

- సీఎం చంద్రాబు నాయుడు







హిల్ వ్యూ స్టేడియానికి చేరుకుంటున్న భక్తులు



బాబా మహాసమాధికి నమస్కరిస్తున్న ప్రధాని మోదీ

పుట్టపర్తి, టౌన్, రూరల్, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): సత్యసాయి శత జయంతి ఉత్సవాలు పుట్టపర్తిలో వైభవంగా సాగుతున్నాయి. హిల్‌వ్యూ స్టేడియంతో బుధవారం నిర్వహించిన వేడుకలకు ప్రధాని నరేంద్ర మోదీ, సీఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, కేంద్ర మంత్రులు భూపతి రాజు శ్రీనివాస్ వర్మ, కిషన్ రెడ్డి, రామ్మోహన్ నాయుడు, రాష్ట్ర మంత్రులు, భారత క్రికెట్ జట్టు మాజీ కెప్టెన్ సచిన్ టెండూల్కర్, బాలీవుడ్ నటి (మిగతా 6లో..)

రైతుకు పండుగ

- రెండో విడత అన్నదాత సుఖీభవ సొమ్ము విడుదల
- పీఎం కిసాన్ చెక్కులు కూడా..
- ప్రతి నియోజకవర్గంలో కార్యక్రమాలు
- హాజరైన ప్రజాప్రతినిధులు, అధికారులు
- అన్నదాతకు ఆనందం

అనంతపురం అర్బన్, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ సొమ్ము జమతో రైతు మోములో ఆనందం కనిపించింది. జిల్లావ్యాప్తంగా ప్రతి నియోజకవర్గంలో ఈ ఏడాది రెండో విడత అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ సొమ్ము విడుదల కార్యక్రమాలను బుధవారం అట్టహాసంగా నిర్వహించారు. ఆయా ఎమ్మెల్యేలు, ప్రజాప్రతిధులు, జిల్లా ఉన్నతాధికారులు, స్థానిక రైతులు హాజరయ్యారు. ఎమ్మెల్యేలు, ఉన్నతాధికారులు మెగా చెక్కులను విడుదల చేశారు. కడప జిల్లా కమలాపురంలో రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు హాజరైన అన్నదాత సుఖీభవ-పీఎం కిసాన్ సొమ్ము విడుదల రాష్ట్రస్థాయి కార్యక్రమాన్ని నియోజకవర్గ స్థాయిల్లో నిర్వహించిన సభల్లో ఎల్‌ఈడీ స్క్రీన్లపై ప్రొజక్టర్ల ద్వారా ప్రదర్శించారు. రైతు సేవాకేంద్రాల్లోనూ సీఎం ప్రసంగాన్ని ప్రత్యక్ష ప్రసారం చేశారు. జిల్లాలోని 2,75,642 మంది రైతులకు అన్నదాత సుఖీభవ సొమ్ము రూ.137.82 కోట్లు విడుదల చేశారు. 2,55,813 మందికి రూ.51.16 కోట్ల పీఎం కిసాన్ సొమ్ము విడుదలైంది. మొత్తం రూ.188.98 కోట్లు విడుదల చేశారు.

నియోజకవర్గాల వారీగా..

- ఉరవకొండ నియోజకవర్గ కేంద్రంలో జిల్లా స్థాయి అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ సొమ్ము విడుదల కార్యక్రమాన్ని నిర్వహించారు. కలెక్టర్ ఆనంద్ హాజరై, అన్నదాత సుఖీభవ చెక్కు విడుదల చేశారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి ఉమామహేశ్వరమ్మ, రైతులు పాల్గొన్నారు.
- రాయదుర్గం నియోజకవర్గంలోని కణేకల్లు మండల కేంద్రంలో ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ సొమ్ము విడుదల కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా నియోజకవర్గానికి సంబంధించిన చెక్కును విడుదల చేశారు.
- రాప్తాడు నియోజకవర్గ పరిధిలోని చెన్నేకొత్తపల్లి మండలం ప్యాదిండిలో అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ సొమ్ము విడుదల కార్యక్రమానికి ఎమ్మెల్యే పరిటాల సునీత హాజరయ్యారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు చిత్రపటానికి నవధాన్యాలతో అభిషేకం చేశారు. అనంతరం ఓ రైతు పొలంలో స్థానిక రైతులతో ముఖాముఖిగా మాట్లాడారు. కార్యక్రమంలో అనంతపురం ఏడీఏ అల్తాఫ్ అలీఖాన్, వ్యవసాయ అధికారులు, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.
- గుంతకల్లు నియోజకవర్గంలోని పామిడి మండల కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమానికి ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం, రాష్ట్ర కార్మిక సంక్షేమ బోర్డు చైర్మన్ వెంకటశివుడు యాదవ్ హాజరయ్యారు. అనంతరం నియోజకవర్గానికి సంబంధించిన చెక్కును విడుదల చేశారు.
- అనంతపురం అర్బన్ నియోజకవర్గ పరిధిలోని ఏ నారాయణపురం పంచాయతీ స్టాలిన్ నగర్ రైతు సేవాకేంద్రంలో నిర్వహించిన కార్యక్రమానికి ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్ హాజరై, చెక్కును విడుదల చేశారు. కార్యక్రమంలో భూసార పరీక్షాకేంద్రం ఏడీ రోజాపుష్పలత, ఏఓ వెంకట్‌కుమార్, టీడీపీ నాయకులు, రైతులు పాల్గొన్నారు.
- తాడిపత్రి పట్టణంలోని ఏఓ కార్యాలయ ఆవరణలో ఎమ్మెల్యే జేసీ అస్మిత్ రెడ్డి అన్నదాత సుఖీభవ చెక్కును విడుదల చేశారు.
- శింగనమల నియోజకవర్గ పరిధిలోని రెడ్డిపల్లిలోని కృషి విజ్ఞానకేంద్రంలో నిర్వహించిన కార్యక్రమానికి ఎమ్మెల్యే బండారు శ్రావణి శ్రీ హాజరయ్యారు. స్థానిక వ్యవసాయ అధికారులతో కలిసి నియోజకవర్గస్థాయి చెక్కును విడుదల చేశారు.
- కళ్యాణదుర్గం పట్టణంలోని కృషి విజ్ఞాన కేంద్రంలో అన్నదాత సుఖీభవ సొమ్ము విడుదల కార్యక్రమాన్ని నిర్వహించారు. స్థానిక టీడీపీ నాయకులు, వ్యవసాయ అధికారులు, రైతులు పాల్గొన్నారు.



ఉరవకొండలో మెగా చెక్కును విడుదల చేస్తున్న కలెక్టర్ ఆనంద్

వీసీఆర్‌కు విముక్తి

- ఆరేళ్ల తరువాత తెరుచుకున్న భవనం తలుపులు
- పాడైపోయిన పరికరాలు
- వినియోగంలోకి తెచ్చేందుకు విద్యాశాఖ అడుగులు



ఆరేళ్ల తర్వాత వీసీఆర్ భవనం తలుపులు తెరుస్తున్న విద్యాశాఖ ఐటీ సెల్ సిబ్బంది

అనంతపురం విద్య, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): వైసీపీ పాలకుల నిర్లక్ష్యం మూలంగా నిర్వీర్యమైపోయిన వర్చువల్ క్లాస్‌రూమ్ (వీసీఆర్) భవనం తలుపులు ఎట్టకేలకు ఆరేళ్ల తరువాత తెరుచుకున్నాయి. విద్యాశాఖలో సాంకేతికతను అమలుచేసే దిశగా 2014-19 మధ్య టీడీపీ ప్రభుత్వం వీసీఆర్‌ను ఏర్పాటు చేసింది. తద్వారా ఒకచోట నుంచే టీచర్.. పిల్లలకు పాఠాలు చెప్పడంతోపాటు వారి అనుమానాలను నివృత్తి చేసేలా రూపొందించారు. విద్యార్థులు సైతం వీసీఆర్ ద్వారా ఏ సబ్జెక్టులో సందేహం ఉంటే.. సంబంధిత నిష్ణాతులైన టీచర్ల దృష్టికి తీసికెళ్లి, నివృత్తి చేసుకునే అవకాశం ఉండేది. 2018లో అనంతపురంలోని రాజేంద్ర మున్సిపల్ ఉన్నత పాఠశాలలో రూ.50 లక్షలతో వీసీఆర్ ఏర్పాటు చేయించారు. 2019లో ధర్మవరానికి వచ్చినపుడు అక్కడే అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రారంభించారు. ఆ వేదిక నుంచే నార్పల గురుకుల పాఠశాల విద్యార్థులతో నేరుగా మాట్లాడారు. అప్పట్లో వీసీఆర్ వ్యవస్థ విద్యారంగంలో విప్లవాత్మకమైనదని టీచర్లు పేర్కొన్నారు. అలాంటి దానిని ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన వైసీపీ పట్టించుకోలేదు. ఏకంగా మూసేసింది.

కూటమి ప్రభుత్వంలో..

కూటమి ప్రభుత్వం కొలువుదీరడంతో తాజాగా వీసీఆర్ తలుపులు తెరుచుకున్నాయి. బుధవారం డీఈఓ ప్రసాద్‌బాబు ఆదేశాల మేరకు సైన్స్ సెంటర్ అధికారి ఆధీనంలోని వీసీఆర్ భవనాన్ని విద్యాశాఖ ఐటీ సెల్ ఏపీఓ మంజునాథ్‌కు అప్పగించారు. దీంతో ఆ భవనాన్ని ఐటీ సెల్ ఏఎస్‌ఓ శ్రీనివాసులు, ఏపీఓ మంజునాథ్, చంద్రశేఖరరెడ్డి సమక్షంలో స్వాధీనం చేసుకున్నారు. తలుపులు తెరిచి చూస్తే భవనం మొత్తం బూజుపట్టిపోయింది. వర్చువల్ క్లాస్‌కు ఏర్పాటుచేసిన టీవీలు, ల్యాప్‌టాప్‌లు, ప్రొజెక్టర్లు, బ్యాటరీలు తదితర పరికరాలన్నీ పాడైపోయాయి. అందులోని కుర్చీలులాంటి పరికరాలు మాత్రమే పనికొస్తాయని తెలుస్తోంది. మిగిలిన ఏ వస్తువూ పనిచేసే అవకాశాలు కనిపించట్లేదు. డీఈఓ దృష్టికి తీసుకెళ్లి వీసీఆర్‌ను వినియోగంలోకి తీసుకురావడానికి చర్యలు తీసుకుంటామని ఏఎస్‌ఓ, ఏపీఓ తెలిపారు. మొత్తంమీద ఆరేళ్ల తర్వాత మళ్లీ వర్చువల్ క్లాస్‌రూమ్‌కు విముక్తి లభించింది.



పరికరాలను పరిశీలిస్తున్న సిబ్బంది

గోవా మద్యం స్వాధీనం



స్వాధీనం చేసుకున్న కారు, మద్యంతో అధికారులు

అనంతపురం క్రైం, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): జిల్లా ఎక్సైజ్ అధికారులు గోవా నుంచి అక్రమంగా తీసుకొస్తున్న మద్యాన్ని పట్టుకున్నారు. అనంతపురం ఎక్సైజ్ స్టేషన్, ఈఎస్ టాస్క్‌ఫోర్స్ అధికారులు బుధవారం నగరంలో తనిఖీలు నిర్వహించారు. జన్మభూమి రోడ్డు సర్కిల్‌లో ఓ కారును తనిఖీ చేయగా.. అందులో గోవా మద్యం లభించింది. మద్యం స్వాధీనం చేసుకుని, కారును సీజ్ చేశారు. కారులోని పుట్లూరు రామాంజనరెడ్డిని అరెస్టు చేశారు. అతడి నుంచి 12.39 లీటర్ల మద్యం స్వాధీనం చేసుకున్నారు. అతడిపై గతంలో కూడా పలు కేసులున్నాయని ఎక్సైజ్ పోలీసులు తెలిపారు. తనిఖీల్లో టాస్క్‌ఫోర్ సీఐ జయనాథ్, అనంతపురం ఎక్సైజ్ ఎస్ఐ జాకీర్ హుస్సేన్, కృష్ణారెడ్డి, సిబ్బంది మురళి, రఘు, నాగలింగ పాల్గొన్నారు.

కోర్టు కేసులపై నిర్లక్ష్యం వద్దు

విద్యాశాఖకు ఏడీ పార్వతి ఆదేశాలు

అనంతపురం విద్య, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): కోర్టు కేసులపై నిర్లక్ష్యం చేయవద్దని విద్యాశాఖ అధికారులు, సిబ్బందికి రాష్ట్ర విద్యాశాఖ అదనపు సంచాలకురాలు పార్వతి సూచించారు. ఆమె బుధవారం జిల్లాల విద్యాశాఖ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. జిల్లాలో 37 కోర్టు కేసులు ఉన్నాయన్నారు. వాటిలో ఎన్ని పరిష్కారమయ్యాయో పక్కాగా సమాచారం ఉండాలన్నారు. ఎప్పటికప్పుడు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాలన్నారు. ఇందుకు డీఈఓ ప్రసాద్ బాబు స్పందిస్తూ కోర్టు కేసుల విషయంలో అప్రమత్తంగా ఉన్నామని వివరించారు. సమీక్షలో ఏడీలు మునీర్, శ్రీనివాసులు, సూపరింటెండెంట్లు పాల్గొన్నారు.



సమీక్షలో పాల్గొన్న డీఈఓ, ఏడీలు

సంస్కృతీసంప్రదాయాలే వారసత్వాలు: కలెక్టర్



హెరిటేజ్ వాక్‌లో పాల్గొన్న కలెక్టర్, ఆనంద్ అధికారులు

అనంతపురం కలెక్టరేట్/టౌన్, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): తరతరాలుగా వస్తున్న సంస్కృతీసంప్రదాయాలే వారసత్వాలనీ, వాటిని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతిఒక్కరిపై ఉందని కలెక్టర్ ఆనంద్ పిలుపునిచ్చారు. ప్రపంచ వారసత్వ వారోత్సవాలు-2025లో భాగంగా బుధవారం నగరంలో హెరిటేజ్ వాక్ చేపట్టారు. కలెక్టరేట్ వద్ద కలెక్టర్ జెండా ఊపి ప్రారంభించారు. కలెక్టర్ మాట్లాడుతూ... వృత్తి, ఉద్యోగ, పని ఒత్తిడి నుంచి శారీరకంగా, మానసికంగా ఉపశమనం పొందేందుకు, ఆరోగ్యవంతమైన జీవితం గడపాలంటే నిత్య జీవితంలో తగినంత సమయం కేటాయించాలన్నారు. నగరం మధ్యభాగంలో ఉన్న పాత జైలును 1882లో ప్రారంభించగా, ఇది బ్రిటిష్ కాలపు కారాగార నిర్మాణ శైలికి ప్రతిబింబంగా నిలుస్తోందన్నారు. స్వాతంత్ర్య పోరాట సమయంలో రాయలసీమ స్వాతంత్ర్య నిర్బంధ కేంద్రంగా ప్రాచుర్యం పొందిన ఈ జైలును కొన్నేళ్ల తరువాత మూసి వేశారన్నారు. ఈ కట్టడాన్ని 143 సంవత్సరాల అనంతరం ప్రజల సందర్శన కోసం పునరుద్ధరించామన్నారు. హెరిటేజ్ వాక్‌లో వివిధ చారిత్రక కట్టడాల గురించి డాక్టర్ రమేష్ నారాయణ.. విద్యార్థులకు వివరించారు. కలెక్టరేట్ వద్ద ప్రారంభమైన ర్యాలీ ఆర్ట్స్ కళాశాల, క్లాక్‌టవర్, పీస్ మెమోరియల్ హాల్ మీదుగా పద్మశ్రీ కల్లూరు సుబ్బారావు జిల్లా పురావస్తు ప్రదర్శనశాలకు చేరుకుంది. కార్యక్రమంలో పురావస్తు, ప్రదర్శనశాలల శాఖ ఏడీ స్వామినాయక్, జిల్లా పర్యాటక శాఖాధికారి జయకుమార్‌బాబు, డీఈఓ ప్రసాద్‌బాబు పాల్గొన్నారు.

పంట సంకటం..!

సందిగ్ధంలో శింగనమల చెరువు ఆయకట్టు రైతులు


పంటకు నీరు సరిపడుతుందో.. లేదోనన్న సందేహం

తక్కువైతే నష్టపోతామన్న ఆందోళన

నీరివ్వాలని వేడుకోలు

7





తనివితీరా నీరు

- హెచ్చెల్సీ, హంద్రీనీవాకు అదనపు జలాలు
- సాగవుతున్న ఆయకట్టు పొలాలు
- అన్నదాతల్లో ఆనందం

7



చిన్నారికి సుకన్య పథకం పాసు పుస్తకం అందజేస్తున్న ప్రధాని మోదీ



వసంత లక్ష్మి కూచిపూడి నృత్య ప్రదర్శన

విశ్వ ప్రేమికుడి వేడుక



సత్యసాయి స్టాంపులను ఆవిష్కరిస్తున్న ప్రధాని, సీఎం, డిప్యూటీ సీఎం తదితరులు



ప్రధాని మోదీకి జ్ఞాపికను బహూకరిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు

● ప్రముఖుల హాజరు



హిల్ వ్యూ స్టేడియంలో జరిగిన వేడుకలలో సుప్రీం కోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్వీ రమణ, మంత్రులు అనగాని సత్యప్రసాద్, సవిత, సత్యకుమార్ యాదవ్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్, ఎంపీ బీకే పార్థసారథి, పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూరా రెడ్డి పాల్గొన్నారు.

● ఆత్మీయ పలకరింపులు



సత్యసాయి శత జయంతి ఉత్సవాల్లో పాల్గొన్న ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబు, సచిన్, ఐశ్వర్యా రాయ్ బచ్చన్ తదితరులు వేదికపై ఆత్మీయంగా పలకరించుకున్నారు. సత్యసాయితో ఉన్న బంధాలను నెమరువేసుకున్నారు. సభ ముగియగానే సత్యసాయి మహా మంగళ హారతి పట్టారు. ప్రధాని, సీఎం సహా అందరూ లేచి నిలబడి హారతి గీతంలో గళం కలిపారు. చేతులు జోడించి లీనమైపోయారు.

● ప్రధానికి ఘనస్వాగతం



సత్యసాయి శతజయంతి ఉత్సవాల్లో పాల్గొనేందుకు ప్రధాని నరేంద్ర మోదీ బుధవారం ఉదయం 9.50 గంటలకు పుట్టపర్తి విమానాశ్రయానికి చేరుకున్నారు. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, కేంద్ర, రాష్ట్ర మంత్రులు శ్రీనివాస వర్మ, అనగాని, సవిత, పయ్యావుల కేశవ్, సత్యకుమార్ యాదవ్, చీఫ్ సెక్రటరీ విజయానంద్, డీజీపీ హరీష్ కుమార్ గుప్తా, కలెక్టర్ శ్యాంప్రసాద్, ఎంపీ బీకే పార్థసారథి, ఎమ్మెల్సీ రాంభూపాల్ రెడ్డి, ఎమ్మెల్యేలు పల్లె సింధూరా రెడ్డి, పరిటాల సునీత, ఎంఎస్ రాజు, కందికుంట వెంకట ప్రసాద్, బండారు శ్రావణి, దగ్గుబాటి వెంకటేశ్వరప్రసాద్, బీజేపీ నాయకులు విష్ణువర్ధన్ రెడ్డి, జీఎం శేఖర్, టీడీపీ జిల్లా అధ్యక్షులు అంజినప్ప, వెంకటశివుడు తదితరులు స్వాగతం పలికారు.

● కొత్త కానుకలు



ప్రశాంతి నిలయంలో సత్యసాయి మహా సమాధిని దర్శించుకున్న అనంతరం రైతులకు ట్రస్టు తరపున ప్రధాని మోదీ గోదానం చేశారు. ముగ్గురు రైతులకు గిర్ ఆవులను అప్పగించారు. ఈ పథకం కింద మొత్తం వంద మంది రైతులకు గిర్ ఆవులను ఇచ్చారు. హిల్‌వ్యూ స్టేడియంలో పరిగి మండలానికి చెందిన జాహ్నవి, లయ, నల్లమాడ మండలానికి చెందిన సుమిత్ర బాయికి సత్యసాయి సెంట్రల్ ట్రస్టు తరపున సుకన్య సమృద్ధి యోజన పోస్టల్ ఖాతా పాస్ పుస్తకాలను అందించారు.

● మార్మోగిన శివమణి డ్రమ్స్



శివమణి బృందం డ్రమ్స్ వాయిద్యంతో హిల్ వ్యూ స్టేడియం మార్మోగింది. కేరళ వాయిద్య కళాకారులతో అరగంటపాటు డ్రమ్స్, కొమ్ము వాయిద్యంతో భక్తులను ఉర్రూతలూగించారు. రెండు చేతులతో ఏకకాలంలో నాలుగు డ్రమ్ములను వాయిస్తూ అబ్బురపరిచారు.

● ముఖ్యమంత్రికి వీడ్కోలు

సత్యసాయిబాబా శతజయంతి వేడుకల్లో పాల్గొని తిరుగు ప్రయాణమైన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు పుట్టపర్తి విమానాశ్రయంలో పలువురు నాయకులు, అధికారులు వీడ్కోలు పలికారు. టీడీపీ నాయకులు నాని, జిల్లా అధ్యక్షుడు కొల్లకుంట అంజినప్ప, కలెక్టర్ శ్యాంప్రసాద్, జేసీ మౌర్యభరద్వాజ్, ఎస్పీ సతీష్ కుమార్ తదితరులు ముఖ్యమంత్రికి వీడ్కోలు పలికారు.



(5వ పేజీ తరువాయి)

ఐశ్వర్యరాయ్ బచ్చన్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ తదితరులు హాజరయ్యారు. దేశవిదేశాలకు చెందిన సేవ, రాజకీయ, క్రీడా, సినీ రంగాల ప్రముఖులు వేడుకలలో పాల్గొన్నారు. సత్యసాయి విమానాశ్రయం నుంచి పుట్టపర్తికి, ప్రశాంతి నిలయంలో నుంచి హిల్ వ్యూ స్టేడియానికి ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబు కాన్వాయ్ వెళుతుండగా భక్తులు, ప్రజలు రోడ్డుకు ఇరువైపులా నిలబడి అభివాదం చేశారు. సాయిరాం.. సాయిరం అని నినాదాలు చేశారు. ప్రశాంతి నిలయంలోని సాయి కుల్వంతు మందిరంలో సత్యసాయి మహాసమాధి ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ తదితరులు సందర్శించి పుష్పాంజలి ఘటించారు. సత్యసాయి సువర్ణ విగ్రహం ఎదుట కాసేపు కూర్చుని ప్రధాని ధ్యానం చేశారు. వేద పండితులు ఆయనను ఆశీర్వదించారు. అనంతరం వంద మంది రైతులకు గిర్ ఆవులను ప్రధాని పంపిణీ చేశారు. గోవులకు గడ్డి తినిపించారు.



పుట్టపర్తి ప్రధాన వీధిలో భక్తుల సందడి

అన్ని దారులూ అటు వైపే..

సత్యసాయి శత జయంతి వేడుకలలో పాల్గొనేందుకు దేశ విదేశీ భక్తులు, ఉమ్మడి జిల్లా, స్థానిక భక్తులు, సామాన్యులు తరలివచ్చారు. హిల్ వ్యూ స్టేడియంలో జరిగే ఉత్సవాలకు బుధవారం తెల్లవారు జాము నుంచే క్యూ కట్టారు. పట్టణంలోని అన్ని దారులు స్టేడియంవైపై అన్నట్లు భక్తులు తరలివెళ్లారు. కలెక్టర్ శ్యాంప్రసాద్, ఎస్పీ సతీష్ కుమార్ పట్టణంలో ద్విచక్ర వాహనాలపై తిరుగుతూ పర్యవేక్షించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పోలీసులు ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.





ఈశ్వరమ్మ చిత్రపటం

వేదికపై ప్రముఖులు

హిల్ వ్యూ స్టేడియంలోని ప్రధాన వేదికపై ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబు, సచిన్, ఐశ్వర్యా రాయ్ బచ్చన్, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేశ్, సత్యసాయి సెంట్రల్ ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ ఆర్‌జే రత్నాకర్, కేంద్ర, రాష్ట్ర మంత్రులు ఆశీనులయ్యారు. ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబు, సచిన్ మాట్లాడుకుంటూ కనిపించారు. అందరూ కలిసి సత్యసాయి స్మారక నాణేలను, తపాలా బిళ్లలను ఆవిష్కరించారు. సత్యసాయి సేవలను, ఆయనతో తమకున్న ఆధ్యాత్మిక అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. ఏపీ, తెలంగాణ, తమిళనాడులో 30 లక్షల మందికి సత్యసాయి తాగునీరు అందించడం, ఒడిసాలో వరద బాధితులకు ఇళ్ల నిర్మాణం, ఉచిత విద్య, వైద్య సేవలను తమ ప్రసంగాల్లో ప్రస్తావించారు.

అలరించిన సాంస్కృతిక ప్రదర్శనలు

హిల్‌వ్యూ స్టేడియంలో సత్యసాయిబాబా జీవిత చరిత్ర, మహిమలు, అధ్యాత్మిక, విద్య, వైద్య సేవలకు సంబంధించిన ముఖ్యమైన ఘట్టాలను డిజిటల్ స్క్రీన్స్‌పై ప్రదర్శించారు. సంగీత దర్శకుడు శివమణి డ్రమ్స్, గాయకులు సుధ, రఘునాథన్ బృందం సంగీత కచేరి భక్తులను అలరించాయి. వసంతలక్ష్మి బృందం కూచిపూడి నృత్య ప్రదర్శన, శ్రీమతి ఈశ్వరమ్మ ఉన్నత పాఠశాల విద్యార్థుల, సత్యసాయి ప్రాథమిక పాఠశాల విద్యార్థులు గుజరాతీ నృత్యం, వర్ష డ్యాన్స్‌తో సందర్శకులను విశేషంగా ఆకట్టుకున్నారు.



హిల్‌వ్యూ స్టేడియంలో సాంస్కృతిక కార్యక్రమాలు





వేడుకల్లో విదేశీ భక్తురాలు



సత్యసాయి మహాసమాధి వద్ద నివాళులర్పిస్తున్న బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్, కేంద్ర మంత్రి శ్రీనివాస్ వర్మ, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్





సాయికుల్వంత్ హాలులో గేయాలు ఆలపిస్తున్న భక్తులు, హారతి ఇస్తూ..



ప్రధాని మోదీకి స్వాగతం పలుకుతున్న ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, మంత్రి పయ్యావుల కేశవ్, కలెక్టర్ శ్యాంప్రసాద్



ఎమ్మెల్యేలు ఎంఎస్ రాజు, కందికుంట వెంకటప్రసాద్, బీజేపీ నాయకుడు విష్ణువర్ధన్ రెడ్డి



మహాసమాధి పక్కనే కుర్చీ



'సత్యసాయి 1940లో తన 14వ ఏట 'అందిరినీ ప్రేమించు.. అందరినీ సేవించు' అనే సేవా మార్గాన్ని కుగ్రామమైన పుట్టపర్తిలో ప్రారంభించారు. సత్యసాయికి జన్మభూమి, ఖర్మ భూమి పుట్టపర్తి. సత్యసాయి శత జయంతి వేడుకలు వచ్చే వందేళ్లపాటు చేయబోయే సేవలకు పునాది కావాలి. సత్యసాయి సేవలు, బోధనలు, ప్రేమతత్వానికి విశ్వవ్యాప్తంగా భక్తులు ఉన్నారు. సేవాదళ్ ఉంది. వీరందరూ సత్యసాయి సేవా మార్గంలో పయనించి, ఎనలేని సేవలు అందిస్తున్నారు. సత్యసాయి శివైక్యం అయిన తరువాత 15 సంవత్సరాలుగా సత్యసాయి సేవలను పారదర్శకంగా కొనసాగించడం మీ వల్లే సాధ్యమైంది. ఇదంతా సత్యసాయి ఆధ్యాత్మిక తత్త్వంతోనే సాగుతోంది. శతజయంతి వేడుకలకు హాజరైన ప్రపంచ వ్యాప్త సత్యసాయి కుటుంబానికి ధన్యవాదాలు..'

- ఆర్‌జే రత్నాకర్



'అత్యంత వెనుకబడిన జిల్లాలో పుట్టిన భగవాన్ సత్యసాయి బాబా రాయలసీమ ప్రజల దాహార్తిని తీర్చేందుకు కృషి చేశారు. ప్రధాని మోదీ చేపట్టిన జల్ జీవన్ మిషన్ తరహాలో ఆయన ఈ ప్రాంత దాహార్తి తీర్చారు. జల్ జీవన్ మిషన్‌కు అంకురమే ఆయన చేపట్టిన తాగునీటి ప్రాజెక్టు. ఏ ప్రభుత్వాలూ ఆలోచించని సమయంలోనే భగవాన్ సత్యసాయిబాబా ఈ ప్రాంత ప్రజలకు తాగునీటిని అందించాలని తలంచారు. ముఖ్యమంత్రిగా చంద్రబాబు ఉన్నప్పుడు సత్యసాయి తాగునీటి పథకానికి బాబా రూ.400 కోట్లు ఇచ్చారు. చంద్రబాబు అండగా నిలిచి సత్యసాయి సాగునీటి పథకానికి శ్రీకారం చుట్టారు. ఆయన సేవాతత్పరకు ఎంత మంది ప్రభావితం అయ్యారో లెక్కే లేదు. ప్రపంచానికి వెలుగునిచ్చే మహోన్నత వ్యక్తి ఇక్కడ పుట్టడం మనందరి అదృష్టం'

-ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్



'మనుషుల్లో ప్రేమ ఉన్నంత వరకూ భగవాన్ సత్యసాయి బాబా మన మధ్యలోనే ఉంటారు. మనం నిజం మాట్లాడితే సత్యసాయిబాబా మనతోనే ఉంటారు. అందరినీ ప్రేమించు... అందరికీ సేవ చేయి.. ఎవరినీ బాధించకు.. అని ఆయన చూపిన బాటలో మనమంతా నడవాలి. భగవాన్ చూపిన పవిత్ర మార్గాన్ని అనుసరిస్తూ శ్రీసత్యసాయి సెంట్రల్ ట్రస్ట్, శ్రీసత్యసాయి సేవా సంస్థలు సమాజానికి విశేషమైన సేవలను అందిస్తున్నాయి. పేదలకు ప్రేమతో సహాయం అందించాలని బాబా చెప్పిన మాటలు నాకు స్ఫూర్తి. భగవాన్ చెప్పినట్టుగా పిల్లలకు చిన్నప్పటి నుంచే నైతిక విలువలు నేర్పడం నా ధ్యేయం. మనుషుల్లో దేవుడిని చూశారు భగవాన్... ప్రేమతో ప్రపంచాన్ని గెలిచారు..'

- ఐటీశాఖ మంత్రి నారా లోకేశ్

నన్ను సాయిబాబా అనే వారు..



ఐదేళ్ల వయస్సులో పాఠశాలలో, బయట నా జుట్టును చూసి సాయిబాబాలా ఉన్నాడు అనే వారు. అప్పట్లో నాకు ఏదీ అర్థమయ్యేదికాదు. సత్యసాయి బాబా దర్శనంతో నాకు అసలు విషయం అర్థమైంది. 19 ఏళ్ల వయస్సులో మొదటిసారి వైట్‌ఫీల్డ్‌లో సత్యసాయి దర్శనం చేసుకున్నాను. ఆ తరువాత పలుమార్లు సత్యసాయి దర్శనానికి వెళ్లాను. ఇదే స్టేడియంలో 1997లో అప్పటి, ఇప్పటి సీఎం చంద్రబాబు సమక్షంలో క్రికెట్ ఆడాం.. విజయం సాధించాం. అవన్నీ ఇప్పుడు గుర్తుకు వస్తున్నాయి. సత్యసాయిని ఎన్నో ప్రశ్నలు అడగాలని అనుకున్నాను. కానీ అడగలేకపోయాను. ఎవరినీ తక్కువ అంచనా వేయకూడదని, ఒక నిర్ణయానికి రాకూడదని సత్యసాయి అప్పట్లో చెప్పేవారు.

-సచిన్ టెండూల్కర్

నేనూ బాలవికాస్ విద్యార్థినే..



ఆనాడు, ఈనాడు నేను బాలవికాస్ విద్యార్థినే. సత్యసాయి బాలవికాస్ విద్య ద్వారానే నేను ఈ రోజు ఈ స్థాయిలో ఉన్నాను. బాలవికాస్ విద్య బాల్యంలోనే విలువలను, క్రమశిక్షణను, ఆధ్యాత్మికతను బోధిస్తుంది. భవిష్యత్తుకు మూలం ఇది. జీవితానికి విద్య ఒకటే ప్రమాణికం కాదు, విలువలు, సామాజిక స్పృహ, సేవాభావం వంటివి కావాలన్నది సత్యసాయి బోధనల తత్త్వం. సత్యసాయి బాబా ప్రేమ, సేవ, దయకు సరిహద్దులు లేవు. ఏపీ, కర్ణాటక, తమిళనాడులో లక్షలాది మందికి తాగునీరు అందించడం, గ్రామీణాభివృద్ధి, యువత శక్తి వృద్ధికి అనేక కార్యక్రమాలు అమలు చేయడం బాబా అపారమైన సేవాశక్తికి నిదర్శనం. సత్యం, ధర్మం, శాంతి, ప్రేమ, అహింసలు సత్యసాయిబాబా జీవితం. ఈ విలువలను మనం ఆచరణలో పెట్టడమే నిజమైన భక్తి.

- ఐశ్వర్యారాయ్ బచ్చన్, బాలీవుడ్ నటి

నేడు పుట్టపర్తికి కేంద్రమంత్రి గడ్కరీ

పుట్టపర్తి టౌన్, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): సత్యసాయిబాబా శతజయంతి వేడుకలలో పాల్గొనేందుకు కేంద్ర రోడ్లు, రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీ గురువారం పుట్టపర్తికి వస్తున్నారు. ఆయన ఉదయం 6.30 గంటలకు నాగపూర్ విమానాశ్రయం నుంచి బయలుదేరి 8.30 గంటలకు పుట్టపర్తికి చేరుకుంటారు. ఉదయం 9 గంటలకు ప్రశాంతి నిలయం చేరుకుని, సత్యసాయి శతజయంతి వేడుకల్లో పాల్గొంటారు. అనంతరం జిల్లాలో జాతీయ రహదారుల ప్రాజెక్టుల పురోగతి గురించి సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహిస్తారు. మధ్యాహ్నం 12 గంటలకు తిరిగి నాగపూర్ బయలుదేరతారు.

రాష్ట్ర మంత్రులు కూడా..

భగవాన్ సత్యసాయిబాబా శతజయంతి వేడుకల్లో పాల్గొనడానికి రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ గురువారం పుట్టపర్తికి వస్తున్నారు. సత్యసాయి శతజయంతి వేడుకలు ముగిసేవరకు ఆయన పుట్టపర్తిలోనే ఉంటారు. జయంతి వేడుకల ఏర్పాట్లను పర్యవేక్షిస్తారు. రాష్ట్ర రోడ్లు భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి కూడా శతజయంతి ఉత్సవాల్లో పాల్గొనడానికి పుట్టపర్తికి గురువారం వస్తున్నారు.

ప్రశాంతి నిలయంలో నేడు..

సాయికుల్వంతు మందిరంలో సత్యసాయి ప్రపంచ సదస్సు నిర్వహిస్తారు. ముఖ్య అతిథిగా కేంద్ర మంత్రి గడ్కరీ హాజరవుతున్నారు. ప్రపంచ శాంతి కోసం జరిగే ఈ సదస్సులో 45 దేశాలకు చెందిన 2500 మంది ప్రతినిధులు పాల్గొంటారు. సాయంత్రం యువత భక్తిగీతాల ఆలాపన ఉంటుంది.

ఎలా ఉండేది..?

- వేళకు వచ్చి వెళ్లిపోతున్న వార్డెన్
- వంట మనిషి లేరు.. కాపలా ఉండేవారూ లేరు
- పైకప్పు పెచ్చులూడుతున్న గదులు
- తాండవిస్తున్న అపరిశుభ్రత
- బిక్కుబిక్కుమంటూ గడుపుతున్న విద్యార్థులు
- అధ్వానంగా చియ్యేడు గిరిజన బాలుర వసతి గృహం



తాడుతో వేలాడ తీసిన లైటు



చియ్యేడు గిరిజన బాలుర వసతి గృహం



భవనంలోపల వరండాలో దెబ్బతిన్న బండల పరుపు

అనంతపురం రూరల్, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): అనంతపురం రూరల్ మండలం చియ్యేడు గిరిజన సంక్షేమ వసతిగృహంలో సమస్యలు తాండవం చేస్తున్నాయి. ఈ హాస్టల్‌లో విద్యార్థులకు వంట చేసే సిబ్బంది కూడా లేరు. కొన్నేళ్లుగా బయటి వ్యక్తులతోనే వంట చేయిస్తున్నారు. పర్యవేక్షణ కొరవడటంతో వసతి గృహ భవనం శిథిలావస్థకు చేరుకుంది. ఏగది చూసిన పైకప్పు పెచ్చులూడిన దృశ్యాలే కనిపిస్తున్నాయి. విద్యుత్ లైట్లను కూడా తాళ్లతో వేలాడితీసిన పరిస్థితి. హాస్టల్ వరండాలోను ఇదే దుస్థితి. వరండాలో బండలు పైకి లేచాయి. ఎటుచూసినా అపరిశుభ్రతే. విద్యార్థులుండే గదులు మొదలుకొని హాస్టల్ ఆవరణ, పరిసరప్రాంతాలు అధ్వానంగా ఉన్నాయి. మరుగుదొడ్లు కంపు కొడుతున్నాయి. ఇలా విద్యార్థుల భద్రత గాల్లో దీపంలా మారింది.

రోగాలతో విద్యార్థులు

వసతిగృహంలో మౌలిక వసతులు అధ్వానంగా ఉన్నాయి. ఇక్కడ నాలుగు నుంచి పదో తరగతి చదివే పిల్లలు మొత్తం 44మంది ఉన్నారు. ఏ గదిలో చూసినా పెచ్చులూడిన పై కప్పులు, బీటలు వాలిన గోడలు, పగిలిన బండలు, పగిలిన కిటికీలే కనిపిస్తాయి. వసతి గృహం చుట్టు పిచ్చి మొక్కలు పెరిగడంతో విషపురుగుల తాకిడి పెరిగింది. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా కేటాయించిన నిధులతో కొన్ని చోట్ల మరమ్మతులు జరిగినట్లు సమాచారం. అయితే ఈ హాస్టల్‌కు ఆ మరమ్మతులు వర్తించలేదు. అసలు ఈ హాస్టల్ అధికారులు మరమ్మతుల కోసం ప్రతిపాదనలు పంపారా లేదా అనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి.

కుక్, కమాటీ (హెల్పర్), వాచ్‌మన్ పోస్టులు ఖాళీ

చియ్యేడు గిరిజన సంక్షేమ వసతిగృహంలో కుక్, కమాటీ, వాచ్‌మన్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. సంక్షేమ వసతిగృహాలకు ఆ పోస్టులే కీలకం. అధికారులు పట్టించుకోకపోవడంతో బయటి నుంచి ఓ వ్యక్తితో వంట చేయించుకుని, అతడికి నెలకు కొంత ముట్టచెబుతున్నారు. ఇక మిగిలిన ప్రతి పనిని విద్యార్థులే చేసుకోవాల్సి వస్తోంది. విద్యార్థులే అన్నం వడ్డించుకోవడం, పాత్రలు కడుకోవడం మొదలుకొని కొన్ని సందర్భాల్లో వంట చేయడానికి హెల్పర్లుగా మారుతున్నారు. ఖాళీ ఉన్న పోస్టులను అవుట్‌సోర్సింగ్ పద్ధతిలో భర్తీ చేసుకునే వీలు సంక్షేమశాఖల్లో ఉంటుంది. అయితే సంబంధిత అధికారులు ఆదిశగా చర్యలు తీసుకోకపోవడం విద్యార్థులకు ఇబ్బందికరంగా మారింది.

ఉన్నతాధికారులకు చెప్పాం

వసతి గృహంలోని సమస్యలను మా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. నాతోపాటు అటెండర్ మాత్రమే ఇక్కడ పని చేస్తున్నాడు. అతడికి వంట రాదు. దీంతో బయటి వ్యక్తితో వంట చేయించి పిల్లలకు పెడుతున్నాం. ఈనెల 20తేదీపైన ఒకరిని కేటాయిస్తామని ఉన్నతాధికారులు పేర్కొన్నారు. భవనం పెచ్చులూడిపోయింది. రెండు నెలల కిందట ఇంజనీర్ వచ్చి మొత్తం పరిశీలించారు. మరమ్మతులకు రూ.25లక్షల వరకు అవుతుందని అంచనా వేశారు.

- ప్రతాప్, హాస్టల్ వార్డెన్, చియ్యేడు



పెచ్చులూడిన విద్యార్థులుండే గదులు, వసతి గృహం వరండా

రాత్రి వేళ బిక్కుబిక్కుమంటూ...

వసతి గృహంలో వాచ్‌మన్, ఇతర సిబ్బంది లేకపోవడంతో విద్యార్థులు నిత్యం అవస్థలు పడుతున్నారు. నగరంలోని ఓ వసతి గృహంలో పని చేస్తున్న అటెండర్‌ను మూడేళ్ల కిందట అక్కడకు పంపారు. ఆయన ఉదయం నుంచి రాత్రి వరకు ఉంటున్నట్లు తెలుస్తోంది. వార్డెన్ ఉదయం రావడం హాజరు నమోదు చేసి వెళ్లిపోవడం, తిరిగి సాయంత్రం రావడం రాత్రి విద్యార్థుల భోజనం అనంతరం వెళ్లిపోతు న్నారు. దీంతో తమకు రక్షణ ఉండేవారు ఎవరూ లేక రాత్రంతా విద్యార్థులు బిక్కు..బిక్కుమంటూ ఉండాల్సిన దుస్థితి నెలకొంది. పొద్దుకాని పొద్దులో ఏదైనా జరిగినా, ఇబ్బంది వచ్చినా విద్యార్థులు పరిస్థితి అంతే? జ్వరం వచ్చిన, కడుపునొప్పి వచ్చిన రాత్రంతా రగ్గు కప్పుకొని ముడుక్కోవాల్సిన పరిస్థితులు ఉన్నాయి. వసతి గృహం ఊరికి దూరంగా ఉండటంతో అక్కడ జరిగే ఏ విషయమూ గ్రామస్థులకు త్వరగా తెలిసే పరిస్థితి లేదు.



పిచ్చిమొక్కలతో నిండిపోయిన వసతి గృహం పరిసర ప్రాంతం

అరటి కిలో రూ.6కి తగ్గకూడదు

- కలెక్టర్ ఆనంద్



అనంతపురం కలెక్టరేట్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): అరటి కిలో ధర రూ.6కి తగ్గకుండా రైతుల నుంచి కొనుగోలు చేయాలని కలెక్టర్ ఆనంద్.. వ్యాపారులకు సూచించారు. కలెక్టరేట్‌లో జిల్లాలోని అరటి వ్యాపారులు, ఎగుమతిదారులు, ఉద్యాన, మార్కెటింగ్, జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖల అధికారులతో ధర నియంత్రణపై సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ... జిల్లాలో 38,984 ఎకరాల్లో అరటి సాగులో ఉందన్నారు. అరటి రెండో పంట నాణ్యతగా లేకపోవడం, మహారాష్ట్రలో అధికంగా దిగుబడి రావడంతో అరటి ధర కిలో రూ.2 నుంచి రూ.3కి పడిపోయిందన్నారు. రీటైల్ ధర మాత్రం కిలో రూ.25పైనే ఉందన్నారు. ఎగుమతిదారులు ఇతర దేశాల మార్కెట్‌కు కిలో రూ.8కి తగ్గకుండా కొనుగోలు చేయాలని సూచించారు. లేనిపక్షంలో జిల్లాలో వేల సంఖ్యలో ఉన్న మహిళా సంఘాల ద్వారా రైతుల నుంచి అరటి కొనుగోలు చేసి, ప్రజలకు ఇళ్ల వద్దకే అమ్మకాలు చేపడతామన్నారు. తద్వారా వ్యాపారులకు నష్టం వాటిల్లుతుందన్నారు. అరటి పంట నాణ్యత పెంపుపై దృష్టిపెడితే ఎగుమతులు పెరిగే అవకాశం ఉందన్నారు. నాణ్యత పెంచేందుకు ఫ్రూట్ కేర్ పద్ధతిని ఉద్యానశాఖ రాయితీని వినియోగించుకోవాలన్నారు. మహారాష్ట్ర అరటి ధరకు సమానంగా జిల్లా రైతులకు కూడా రైలు రవాణా సౌకర్యం కల్పించటానికి రాయితీ ఇవ్వాల్సిందిగా ఎగుమతిదారులు కోరారు. సమావేశంలో జిల్లా ఉద్యానశాఖ అధికారి ఉమాదేవి, మార్కెటింగ్ అధికారి రాఘవేంద్రకుమార్, గ్రామీణాభివృద్ధి పీడీ శైలజ పాల్గొన్నారు.

పన్ను వసూళ్లలో నగదు వద్దు

పీఆర్ కమిషనర్ కృష్ణతేజ ఆదేశాలు

అనంతపురం న్యూటౌన్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): స్వర్ణపంచాయతీ పోర్టల్ ద్వారా ఆన్‌లైన్‌లోనే పన్నులు చెల్లించేలా చూడాలనీ, నగదు లావాదేవీలకు అవకాశం ఇవ్వొద్దని పంచాయతీరాజ్ కమిషనర్ కృష్ణతేజ జూమ్ మీట్ ద్వారా జిల్లా అధికారులను ఆదేశించారు. బుధవారం స్థానిక జిల్లా పరిషత్ కార్యాలయ ఆవరణలోని డీపీఆర్‌సీ సమావేశ భవనంలో ఏర్పాటు చేసిన జూమ్‌మీట్‌కు డీఎల్‌పీఓ విజయ్‌కుమార్, డీడీఓలు నాగశివలీల, విజయలక్ష్మి, నాగేశ్వరరావు హాజరయ్యారు. కమిషనర్ మాట్లాడుతూ.. స్వమిత్వకు సంబంధించి క్షేత్రస్థాయిలో సమస్యలను గుర్తించి వాటిని పరిష్కరించేలా చర్యలు చేపట్టాలన్నారు. సమావేశంలో ఏఓలు నాగరాజు, సోముశేఖర్, ఎంపీడీఓలు, డిప్యూటీ ఎంపీడీఓలు పాల్గొన్నారు.

టమోటా కిలో రూ.47

అనంతపురం రూరల్, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): కక్కలపల్లి టమోటా మార్కెట్లో బుధవారం టమోటాలు కిలో గరిష్ఠంగా రూ.47తో అమ్ముడుపోయినట్లు రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రూప్‌కుమార్ తెలిపారు. అలాగే కనిష్ఠంగా రూ.27తో, సరసరిగా రూ.33తో విక్రయాలు జరిగాయన్నారు. మార్కెట్‌కు 2145 టన్నుల టమోటాలు వచ్చినట్లు పేర్కొన్నారు.

పంట సంకటం..!

సందిగ్ధంలో శింగనమల చెరువు ఆయకట్టు రైతులు

- పంటకు నీరు సరిపడుతుందో.. లేదోనన్న సందేహం
- తక్కువైతే నష్టపోతామన్న ఆందోళన
- నీరివ్వాలని వేడుకోలు




సాగుకు ఆయకట్టు భూములను సిద్ధం చేసుకున్న రైతులు

శింగనమల, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): శింగనమల చెరువు ఆయకట్టు రైతులకు కొత్త చిక్కు వచ్చిపడింది. చెరువులో నీరు ఉంది. 75 శాతమే ఉంది. ఆ నీరు పంటకు సరిపడుతుందా, చివరి ఆయకట్టుకు అందుతుందా.. అన్న సందేహాలు అన్నదాతలను వెంటాడుతున్నాయి. దీంతో పంట సాగుకు తటపటాయిస్తున్నారు. చెరువులో నిండుగా నీరు ఉండుంటే నిర్భయంగా పంట పెట్టేవారు. 75 శాతమే ఉండడంతో తటపటాయిస్తున్నారు. నీరు చాలకపోతే పంటను కోల్పోవాల్సి ఉంటుందని అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో భూములను సిద్ధం చేసుకున్నా.. వరి సాగు చేయాలా.. వద్దా.. అని సందిగ్ధంలో ఉన్నారు.

భిన్న అభిప్రాయాలు

శింగనమల శ్రీరంగనాయకుని చెరువుకు ఇటీవల వర్షాలకు నీరు చచేరింది. చెరువు పూర్తిస్థాయి నిల్వ సామర్థ్యం టీఎంసీ కాగా.. 0.75 టీఎంసీ మేర నీరు ఉంది. చెరువు ఆయకట్టు భూముల్లో పంటల సాగుకు రైతులు సిద్ధమవుతున్నారు. దాదాపు 1500 ఎకరాల్లో వరి సాగుకు శింగనమల, గోవిందరాయునిపేట, శివపురం, సి.బండమీదపల్లి, చక్రాయపేట, పోతురాజుకాల్వ, సోదనపల్లి గ్రామాల రైతులు భూములు దుక్కులు చేసుకున్నారు. చెరువులో నీరు చివరి ఆయకట్టు భూముల వరకు, పంట చివరి వరకు సరిపడుతుందా.. లేదా.. అని సందేహంగా ఉన్నారు. చివరి ఆయకట్టు రైతులు పంట పెట్టడానికి మొగ్గు చూపడంలేదని తెలుస్తోంది. ఉన్న నీటిని పొదుపుగా వాడుకుంటే సరిపోతుందని పలువురు రైతులు అభిప్రాయపడుతున్నారు. హెచ్చెల్సీ నీరు వదిలితే.. పంటకు ఢోకా ఉండదని మరికొందరు కోరుతున్నారు.

చివరి వరకు నీరుంటే పంట పండుతుంది



పోతురాజుకాల్వ ఆయకట్టు భూములు చివర ఉన్నాయి. చెరువులో సరిపడా నీరు ఉందని పంట సాగుకు సిద్ధం చేసుకున్నాం. కొందరు రైతులు పంట ముగిసే వరకు నీరు రాదన్న ఉద్దేశంతో తటపటాయిస్తున్నారు. నీటిని వృథా చేయకుండా వాడుకుంటే పంట పండుతుంది.

-రైతు శ్రీరాములు, పోతురాజుకాల్వ

వంతులవారీగా వాడుకోవాలి



పంటకు అవసరమైన నీరు ఉం దన్న నమ్మకంతోనే నెలాఖరులో పంట సాగు చేస్తున్నాం. రైతు లు వంతుల వారీగా నీటిని వా డుకుంటే పంటకు సరిపోతుంది.

-రైతు చాకలి నాగేంద్ర, గోవిందరాయునిపేట

తక్కువ వస్తే.. నీరు వదలాలి



చెరువు ఆయకట్టులో పంట సాగుకు సిద్ధం చేసుకున్నాం. చెరువులో పంటకు అవసరమైన నీరు లేదని రైతులు అందోళనతో ఉన్నారు. పంటకు చివరలో నీరు తక్కువ వస్తే పరిస్థితి ఏంటన్న అనుమానాలు తలెత్తుతున్నాయి. ప్రజాప్రతినిధులు చొరవ చూపి, నీరు విడుదల చేయించాలి.

-రైతు మునేంద్ర, చిన్నజలాలపురం

చెరువుకు నీరు తీసుకొస్తాం




చెరువు ఆయకట్టు భూముల్లో వరి సాగుకు రైతు లు సిద్ధమవుతున్నారు. చాలామంది చెరువులోని నీరు పంటకు సరిపడుతుందో.. లేదోనన్న అనుమానంతో ఉన్నారు. విషయాన్ని ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ దృష్టికి తీసుకెళ్లాం. నీరు తక్కువ వస్తే.. హెచ్చెల్సీ ద్వారా ఇస్తామని భరోసా ఇచ్చారు. పంటకు ఏ ఇబ్బందీ ఉండదు.

-గార్లదిన్నె సత్యనారాయణ, శింగనమల ఆయకట్టు సంఘం అధ్యక్షుడు

తనివితీరా నీరు

- హెచ్చెల్సీ, హంద్రీనీవాకు అదనపు జలాలు
- సాగవుతున్న ఆయకట్టు పొలాలు
- అన్నదాతల్లో ఆనందం



హంద్రీనీవా కాలువలో కృష్ణా జలాలు

అనంతపురం క్లాక్‌టవర్, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాకు ఈ దఫా నీటి కేటాయింపులు సంతృప్తికరంగా ఉన్నాయి. దీంతో ఆయకట్టు రైతులు మురిసిపోతున్నారు. ఉమ్మడి జిల్లాకు ప్రధాన నీటి వనరులుగా హెచ్చెల్సీ, హెచ్ఎన్ఎస్ఎస్ ఉన్నాయి. తుంగభద్ర డ్యాం నుంచి హెచ్చెల్సీ ద్వారా జిల్లాకు నీరు చేరుతుంది. శ్రీశైలం డ్యాం నుంచి మల్యాల వద్ద ఎత్తిపోతల పథకం కింద హంద్రీనీవా ద్వారా ఉమ్మడి జిల్లాకు కృష్ణా జలాలు వస్తాయి. మునుపెన్నడూ లేనివిధంగా హంద్రీనీవా ద్వారా 50 టీఎంసీల నీటిని రాబట్టేందుకు ఇంజనీర్లు కృషి చేస్తున్నారు. హెచ్చెల్సీలో గేట్ల మరమ్మతులతో టీబీ డ్యాంలో నీటినిల్వ 80టీఎంసీలకే పరిమితం చేశారు. అయితే కొన్ని గేట్లు అమర్చడంతో టీబీ డ్యాంలో నీటి నిల్వ లభ్యతను 168టీఎంసీలకు పెంచడంతో హెచ్చెల్సీకి అదనపు జలాలు కేటాయించారు. ఈ ఏడాది మొదట హెచ్చెల్సీకి 24టీఎంసీల నీటిని కేటాయించారు. తర్వాత అదనంగా 3.707టీఎంసీలు కేటాయించారు. అదనంగా వచ్చే జలాల్లో హెచ్చెల్సీ వాటా 1.707టీఎంసీలుగా కాగా... కేసీ కెనాల్ డైవర్షన్ కింద 2 టీఎంసీల నీటిని ఇవ్వనున్నారు. దీంతో హెచ్చెల్సీకి 27.775టీఎంసీల నీరు కేటాయించినట్లు లెక్క తేల్చారు. అలాగే హంద్రీనీవా కాలువ వెడల్పు, లైనింగ్ చేపట్టడంతో హెచ్ఎన్ఎస్ఎస్‌లో నీటి వృథా తగ్గి, ప్రవాహ వేగం పెరిగింది. దీంతో శ్రీశైలం డ్యాం నుంచి నీటిని వేగంగా తీసుకోవడానికి అవకాశం ఏర్పడింది.



పెరిగిన కేటాయింపులు

హంద్రీనీవా కాలువ వెడల్పు, లైనింగ్ పనులు పూర్తి కావడంతో నీటి కేటాయింపులు పెంచారు. శ్రీశైలం డ్యాం నుంచి హంద్రీనీవా కాలువకు అధికారికంగా 40టీఎంసీల కేటాయింపులు ఉన్నాయి. శ్రీశైలం డ్యాంలో నీటి లభ్యత పెరడగంతో ఈ ఏడాది అదనంగా మరో 10టీఎంసీలు రాబట్టేందుకు ఇంజనీరింగ్ అధికారులు, ప్రజాప్రతినిధులు ప్రయత్నిస్తున్నారు. జూలై 17న శ్రీశైలం డ్యాం మల్యాల వద్ద హంద్రీనీవాకు నీటి విడుదల ప్రారంభించారు. ఇప్పటి వరకు హంద్రీనీవాకు 22టీఎంసీల నీటిని వదిలారు. హెచ్ఎన్ఎస్ఎస్‌లోని చివరి ప్రాంతం కుప్పానికి హంద్రీనీవా ద్వారా కృష్ణా జలాలను తీసుకెళ్లారు. డిస్ట్రిబ్యూటరీలు (పిల్ల కాలువలు) నిర్మిస్తే కరువు సీమలో మరింత భూమి సాగులోకి వచ్చే అవకాశం ఉంది.

హంద్రీనీవా నీటితో పంట పండించా...



హంద్రీనీవా కాలువ కింద మా పొలం ఉంది. పూర్తిగా నీళ్లు రావడంతో ఐదెకరాల పొలంలో పత్తిపంట సాగుచేశా. నీళ్లు సక్రమంగా వస్తుండటంతో పంట బాగా వచ్చింది. రెండో పంటకూడా వేసుకోవడానికి చూస్తున్నాం. ఈ దఫా ఎక్కువగా నీళ్లు వస్తున్నాయి. ప్రతి సంవత్సరం ఇట్లే నీళ్లు వస్తే దిగుబడి పెరిగి, అప్పుల నుంచి బయటపడొచ్చు.

-తిమ్మప్ప, గడేహోతూరు, వజ్రకరూరు మండలం

50 టీఎంసీలు రాబట్టేందుకు కృషి



ఈ దఫా హంద్రీనీవా కాలువ వెడల్పు, లైనింగ్ చేశాం. దీంతో అధికనీటిని శ్రీశైలం డ్యాం నుంచి తీసుకునేందుకు కృషి చేస్తున్నాం. హంద్రీనీవాకు కేటాయించిన 40టీఎంసీలతో పాటు అదనంగా మరో 10టీఎంసీలు రాబట్టేందుకు చర్యలు తీసుకుంటున్నాం. ఇక టీబీ డ్యాంలో గేట్ల రిపేరీ ఉన్నందున నీటి నిల్వ ఆధారంగా హెచ్చెల్సీకి కేటాయింపులు చేశారు. అదనంగా మరో 3టీఎంసీలకు పైగా నీటిని కేటాయించారు. హంద్రీనీవా, హెచ్చెల్సీ ద్వారా వచ్చే నీరు ఆయకట్టు రైతులకు ఎంతో ఊరట కలిగిస్తోంది.

-నాగరాజ, ఉమ్మడి జిల్లా జలవనరుల శాఖ ప్రాజెక్ట్స్ సీఈ

నేడు ఎంఈఓలు, హెచ్ఎంల సమావేశం

అనంతపురం విద్య, నవంబరు19(ఆంధ్రజ్యోతి): ఎంఈఓలు, పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో గురువారం సమావేశం ఏర్పాటు చేసినట్లు డీఈఓ ప్రసాద్‌బాబు ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు అనంతపురం, మధ్యాహ్నం గుత్తి డివిజన్ వారికి జిల్లా సైన్స్‌సెంటర్‌లో సమావేశం ఉంటుందన్నారు. ఎంఈఓలు, హెచ్ఎంలు హాజరుకావాలన్నారు.

సకాలంలో డ్రిప్ పరికరాలు సరఫరా చేయండి

ఏపీఎంఐపీ రాష్ట్ర ప్రాజెక్టు అధికారి వెంకటేశ్వర్లు

అనంతపురం అర్బన్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని రైతులకు సకాలంలో డ్రిప్, స్ప్రింక్లర్ల పరికరాలు సరఫరా చేసేలా ప్రత్యేక చొరవ చూపాలని ఏపీఎంఐపీ రాష్ట్ర ప్రాజెక్టు అధికారి వెంకటేశ్వర్లు ఆదేశించారు. బుధవారం గుంటూరు నుంచి అన్ని జిల్లాల ఏపీఎంఐపీ పీడీలు, ఏపీడీలు, డ్రిప్ కంపెనీల ప్రతినిధులతో జూమ్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. నమోద చేసుకున్న రైతులతో సబ్సిడీయేతర డబ్బు కట్టించుకోవడంపై దృష్టి సారించాలన్నారు. చెల్లించిన రైతులకు త్వరగా మంజూరు ఉత్తర్వులు జారీ చేయడంతోపాటు పరికరాలు సరఫరా చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. నిబంధనల మేరకు రైతు పొలాల్లో పరికరాలు బిగించేలా చూడాలన్నారు. కార్యక్రమంలో ఏపీఎంఐపీ పీడీ రఘునాథ్‌రెడ్డి, ఏపీడీ ధనుంజయ పాల్గొన్నారు.

ఫలితాలు విడుదల

అనంతపురం రూరల్, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): జేఎన్‌టీయూఏ పరిధిలో సెప్టెంబరు, అక్టోబరు నెలల్లో నిర్వహించిన ఫార్మాడీ ఫలితాలను డైరెక్టర్ ఆఫ్ ఎవాల్యుయేషన్ ఆచార్య నాగప్రసాద్ నాయుడు, పరీక్షల విభాగ కంట్రోలర్ ఆచార్య శివకుమార్ తదితరులు బుధవారం విడుదల చేశారు. ఫార్మాడీ మొదటి సంవత్సరం రెగ్యులర్, సప్లిమెంటరీ ఫలితాలు, ఐదో ఏడాది సప్లిమెంటరీ ఫలితాలను విడుదల చేసినట్లు ప్రకటించారు. ఫలితాలు జేఎన్‌టీయూఏ వెబ్‌సైట్‌లో ఉంచినట్లు తెలిపారు. కార్యక్రమంలో అదనపు కంట్రోలర్లు ఆచార్య శంకర్‌శేఖర్‌రాజు, శ్రీధర్ పాల్గొన్నారు.

చీనీ టన్ను రూ.17 వేలు

అనంతపురం రూరల్, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): అనంత వ్యవసాయ మార్కెట్లో బుధవారం సీజనల్ చీనీకాయలు టన్ను గరిష్ఠంగా రూ.17వేలతో అమ్ముడుపోయినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణికార్యదర్శి మార్కెటింగ్ శాఖ ఏడీ రాఘవేంద్రకుమార్ తెలిపారు. అలాగే కనిష్ఠంగా రూ.8వేలు, సరాసరి ధర రూ.14వేలు పలికాయన్నారు.

ఉపాధ్యాయుడి ప్రతిభ

- రాష్ట్రస్థాయి పరుగు పోటీల్లో పతకాలు
- జాతీయస్థాయికి ఎంపిక



నరేష్‌కుమార్

రొద్దం, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): మండలంలోని కంచిసముద్రం ప్రాథమిక పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయుడు నరేష్‌కుమార్ పరుగు పోటీల్లో సత్తా చాటారు. గుంటూరులోని నాగార్జున యూనివర్సిటీ మైదానంలో బుధవారం నిర్వహించిన అఖిల భారత సివిల్ సర్వీస్ ఉద్యోగుల రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో పాల్గొన్నారు. పరుగు పందెం 400మీటర్లలో ప్రథమ, 100 మీటర్లలో ద్వితీయస్థానం సాధించారు. తద్వారా బిహార్‌లోని పాట్నాలో నిర్వహించే జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. దీంతో ఆయనను కంచిసముద్రం వాసులు, ఉపాధ్యాయులు, ఎంఈఓలు జయభాస్కర్, అరవింద్ అభినందించారు.

జడ్పీ సీ, హెచ్ సెక్షన్ల ఏఓగా ముత్యాలరెడ్డి

అనంతపురం న్యూటౌన్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): జిల్లా పరిషత్ కార్యాలయంలో ఉద్యోగోన్నతిపై ఏఓగా నియమితుడైన ముత్యాలరెడ్డికి సీ, హెచ్ సెక్షన్ల బాధ్యతలు అప్పగించారు. ఏఓ ఫణిశేఖర్‌రెడ్డికి ఐ సెక్షన్ కేటాయించారు. జీ సెక్షన్ ఏఓగా ఉన్న రత్నాబాయి ఉద్యోగోన్నతిపై ఎంపీడీఓగా వెళ్లడంతో ఆ స్థానంలో పెన్షన్ సెక్షన్ ఏఓగా ఉన్న విజయ్‌భాస్కర్‌రెడ్డిని నియమించారు. పలువురి గుమాస్తాల స్థానాలు సైతం మార్చారు. ఈ మేరకు సీఈఓ శివశంకర్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు.

రెండోసారి మండల కన్వీనర్‌గా నరేంద్రనాయుడు



తాడిపత్రి, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): టీడీపీ మండల కన్వీనర్‌గా కూరపాటి నరేంద్రనాయుడిని రెండోసారి ఎన్నుకున్నట్లు ఎమ్మెల్యే జేసీ అశ్మిత్‌రెడ్డి బుధవారం పేర్కొన్నారు. స్థానిక తన స్వగృహంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నరేంద్రనాయుడు మండలంలో పలు అభివృద్ధి పనులు చేసి.. అన్నివర్గాల ప్రజల్లో మంచి గుర్తింపు తెచ్చుకున్నారని, అందువల్ల అతన్ని మళ్లీ కన్వీనర్‌గా ఎంపిక చేశామని అన్నారు. నరేంద్ర మాట్లాడుతూ తనపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా రెట్టింపు ఉత్సాహంతో పార్టీ, ప్రజా సేవ చేస్తానన్నారు.

న్యూస్ బాక్స్

శిక్షణతో నైపుణ్యాలు మెరుగు

అనంతపురంరూరల్, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): శిక్షణ కార్యక్రమాలతో ఆత్మవిశ్వాసం, అంతర్గత శక్తి నైపుణ్యాలు పెంపొందించవచ్చునని వక్తలు తెలిపారు. శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయంలోని సెరికల్చర్ విభాగంలో బుధవారం కేంద్ర రేష్మి మండలి, వస్త్ర మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో రాష్ట్రీయ కర్మయోగి శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. వర్సిటీ వైస్ చాన్సలర్ అనిత, ఆర్ఎస్ఆర్ఎస్ రాప్తాడు శాస్త్రవేత్తలు కిరణ్‌కుమార్, మురళీ హాజరై ఈ మేరకు మాట్లాడారు. కార్యక్రమంలో కోఆర్డినేటర్ సత్యనారాయణ, సెరికల్చర్ ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

బ్యాంక్ గ్యారెంటీతో ఎరువుల విడుదలకు ఉత్తర్వులు

అనంతపురం అర్బన్, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): నగరంలోని కళ్యాణదుర్గం రోడ్డులో గల ఎస్ఆర్ ఫర్టిలైజర్స్ దుకాణంలో అనధికారికంగా నిల్వ ఉంచిన ఎరువులను ఇటీవల వ్యవసాయ అధికారులు సీజ్ చేసి 6ఏ కేసు నమోదు చేసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో కలెక్టర్ ఆనంద్ కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో బుధవారం 6ఏ కేసుపై విచారణ చేశారు. అనంతరం రూ.24,04,310 బ్యాంకు గ్యారెంటీ తీసుకుని సీజ్ చేసిన ఎరువులను విడుదల చేయాలని మధ్యంతర ఉత్తర్వులు జారీ చేశారు. అలాగే అనధికారికంగా ఎరువులు సరఫరా చేయడంతో సీజ్ చేసిన మూడు ఆటోలను ఒక్కో ఆటోకు రూ.2500 బ్యాంకు గ్యారెంటీ తీసుకుని విడుదల చేయాలని ఆదేశించారు.

డిప్యూటీ సీఎంను కలిసిన టీసీ వరుణ్



డిప్యూటీ సీఎంతో టీసీ వరుణ్

అనంతపురం న్యూటౌన్, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): సత్యసాయి బాబా శత జయంతి ఉత్సవాల్లో పాల్గొనేందుకు బుధవారం పుట్టపర్తికి వచ్చిన ప్రధానమంత్రి నరేంద్రమోదీ, సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌ను జనసేన జిల్లా అధ్యక్షుడు, అహుడా చైర్మన్ టీసీ వరుణ్ అక్కడి విమానాశ్రయంలో వేర్వేరుగా కలిసి పుష్పగుచ్ఛాలు అందజేసి ఘనస్వాగతం పలికారు. అనంతరం డిప్యూటీ సీఎంతో ప్రత్యేకంగా సమావేశమై పలు విషయాలు చర్చించినట్లు ఆయన తెలిపారు.



ప్రధానికి స్వాగతం పలుకుతున్న జనసేన నగర అధ్యక్షుడు బాబురావు

అలాగే జనసేన అనంతపురం నగర అధ్యక్షుడు బాబురావు కూడా ప్రధానిని, సీఎంను, డిప్యూటీ సీఎంను విమానాశ్రయంలో కలిసి ఘనస్వాగతం పలికారు. అనంతరం మాట్లాడుతూ ఈ అవకాశం కల్పించిన జిల్లా నాయకులకు, జిల్లా అధ్యక్షుడు టీసీ వరుణ్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

కందుకూరులో పశువైద్య శిబిరం



సత్యసాయి చిత్రపటం వద్ద పూజలు చేస్తున్న జేడీ తదితరులు

అనంతపురం రూరల్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కందుకూరులో బుధవారం సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో ఉచిత పశువైద్య శిబిరం నిర్వహించారు. పశుసంవర్ధక శాఖ జేడీ ప్రేమ్ చంద్ ముఖ్య అతిథిగా పాల్గొని సత్యసాయి చిత్రపటానికి పూజలు చేసి శిబిరాన్ని ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ.. ఏడాదికి ఒక దూడ పొందేలా క్రమ పద్ధతిలో పాడిపశువులను పోషించాలని పాడి రైతులకు సూచించారు. ఎంజిఎన్ఆర్ఈజీఎస్ కింద అర ఎకరంలో పశుగ్రాసం సాగుచేసుకునేందుకు వీలుగా రూ.32వేలను ప్రభుత్వం ఖర్చుచేస్తున్నట్లు తెలిపారు. పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం గ్రామంలో పాడి పశువులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. విశ్రాంత పశువైద్యాధికారి పున్నయ్య ఉచితంగా మందులు అందించారు. కార్యక్రమంలో డివిజనల్ పశువైద్యాధికారులు రమేష్‌రెడ్డి, ప్రాంతీయ పశువైద్యాధికారి పద్మనాభం, మండల పశువైద్యాధికారులు ఉష, మహేష్, సత్యసాయి సేవాసమితి కన్వీనర్ నరసింహప్ప, పశువైద్య సహాయకులు వినీత్, మాధవరాజు, సాదిక్ పీరా తదితరులు పాల్గొన్నారు.

బకాయి వేతనాలు చెల్లించాలని ధర్నా



పంచాయతీ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న నాయకులు, కార్మికులు

అనంతపురం రూరల్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): బకాయి వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ మండలంలోని అనంతపురం రూరల్ పంచాయతీ కార్యాలయం ఎదుట పంచాయితీ కార్మికులు బుధవారం ధర్నా చేపట్టారు. వారికి గ్రామ పంచాయతీ యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షుడు గోపాల్, ప్రధాన కార్యదర్శి శివప్రసాద్, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు రామాంజనేయులు మద్దతు పలికి మాట్లాడారు. గ్రామ పంచాయతీలో 40మంది కార్మికులు పనిచేస్తున్నారన్నారు. వారు గత రెండునెలలుగా వేతనాలు రాక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. సమస్యను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లినా వేతనాలు చెల్లించకపోవడం దారుణమన్నారు. వేతనాలు చెల్లించేందుకు పంచాయతీలో ఆదాయం లేదని అధికారులు చెబుతుండడం దుర్మార్గమన్నారు. వెంటనే కార్మికులకు వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కార్మికులు ఆది, మల్లికార్జున, నాగరాజు, రామాంజి, ప్రభుదాసమ్మ తదితరులు పాల్గొన్నారు.

దళితుల స్థల సమస్య పరిష్కారం



దళితులకు పట్టా అందజేస్తున్న తహసీల్దార్ తదితరులు

ఆత్మకూరు, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో దళితుల స్థల సమస్య పరిష్కారమైంది. అందులో పట్టాలను సైతం బుధవారం తహసీల్దార్ లక్ష్మీనాయక్, టీడీపీమండల కన్వీనర్ శ్రీనివాసులు స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో దళితులకు అందజేశారు. గ్రామంలో 300 కుటుంబాలకు పైగా దళితులు నివాసముంటున్నారు. అయితే చాలా ఏళ్ల క్రితం గ్రామ పంచాయతీలో దళితుల కోసం ఆర్డీటీ సహకారంతో స్థలాన్ని కేటాయించారు. కాగా చాలారోజులుగా దళితులు ఆ స్థలంలో ఇళ్ల పట్టాల కోసం ప్రయత్నం చేస్తున్నా.. ఫలితం లేకుండా పోయింది. కూటమి వచ్చాక సమస్యను ఎమ్మెల్యే పరిటాల సునీత దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఆమె వెంటనే సమస్య పరిష్కరించి ఆ స్థలంలో వారికి పట్టాలు ఇచ్చేలా కృషి చేశారు. దీంతో ఎన్నోఏళ్లుగా పరిష్కారం కాని సమస్యను పరిటాల సునీత, టీడీపీ మండల ఇన్‌చార్జి బాలాజీ పరిష్కరించారని దళితులు ఆనందం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో హిందూపురం పార్లమెంటు అధికార ప్రతినిధి శశాంక్ చౌదరి, ప్రధాన కార్యదర్శి నరసింహచౌదరి, నాయకుడు మల్లన్న పాల్గొన్నారు.



ప్యాదిండిలో మెగా చెక్కును విడుదల చేస్తున్న రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత



స్టాలిన్ నగర్‌లోని ఆర్ఎస్‌కేలో అనంత అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్..



రెడ్డిపల్లి కేవీకేలో శింగనమల ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ..

కూటమి ప్రభుత్వంతోనే రైతుల సంక్షేమం

- ఎమ్మెల్యే పరిటాల సునీత
- అన్నదాత సుఖీభవ-పీఎం కిసాన్ రెండో విడత మెగా చెక్కు విడుదల

చెన్నేకొత్తపల్లి, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): రైతుల సంక్షేమం కూటమి ప్రభుత్వం తోనే సాధ్యమని రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత అన్నారు. అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ రెండో విడత నిధుల విడుదల సందర్భంగా మండలంలోని ప్యాదిండి గ్రామంలో రైతు నాగిరెడ్డి పొలంలో బుధవారం ఆమె రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తొలుత సీఎం చంద్రబాబు చిత్రపటానికి నవధాన్యాలతో అభిషేకం చేశారు. అనంతరం అన్నదాత సుఖీభవ- పీఎం కిసాన్ మెగా చెక్కును విడుదల చేసి మాట్లాడారు. రైతుల సంక్షేమమే ధ్యేయంగా సీఎం చంద్రబాబు పని చేస్తున్నారన్నారు. ఎన్నికలలో ఇచ్చిన హామీలను విజయవంతంగా అమలు చేస్తున్న ఘనత ఆయనకే దక్కిందన్నారు. అన్నదాత సుఖీభవ, పీఎంకిసాన్ కింద ఆర్థికసాయాన్ని రెండో విడత కూడా అందించడంతో రైతులు సంతోషంగా ఉన్నారన్నారు. రాప్తాడు నియోజకవర్గంలో 51,496 మంది రైతులకు రూ.35.08కోట్లు అందజేయగా సీకేపల్లి మండలంలో 9514 మందికి రూ.6.37కోట్లు లబ్ధి చేకూరినట్లు చెప్పారు. త్వరలోనే మిగిలిన రూ.6వేలు కూడా అందుతుందని పేర్కొన్నారు. అర్హత ఉన్న ప్రతిరైతుకు అన్నదాత సుఖీభవ అందుతోందన్నారు. అదే గత వైసీపీ ప్రభుత్వం రైతు సంక్షేమాన్ని ఏమాత్రం పట్టించుకోలేదని ఈ సందర్భంగా దుయ్యబట్టారు. అనంతరం ప్రకృతి వ్యవసాయంలో రాణిస్తూ ఇటీవల ప్రధాని మోదీ చేతులమీదుగా సత్కారం అందుకున్న బత్తలపల్లి మండలం రాఘవం పల్లికి చెందిన చెందిన గంగమ్మ అనే మహిళా రైతును ఎమ్మెల్యే పలువురు రైతులతో కలిసి అభినందించి సన్మానించారు. కార్యక్రమంలో ఏడీఏ అల్తాఫ్ అలీఖాన్, ఏఓ మురళీక్రిష్ణ, సొసైటీ అధ్యక్షుడు నరసింహులు, టీడీపీ కన్వీనర్ ముత్యాల్‌రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు దండు ఓబుళేశు, నాయకులు అంకే అమరేంద్ర,రామసుబ్బమ్మ, జయరామిరెడ్డి, నరసింహులు,మోహన్, ప్రభాకర్, రామకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పార్టీలకతీతంగా పథకాల వర్తింపు: ఎమ్మెల్యే దగ్గుపాటి

అనంతపురంరూరల్: కూటమి ప్రభుత్వం పార్టీలకతీతంగా సంక్షేమ పథకాలను అందిస్తోందని అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్ అన్నారు. మండలంలోని ఎ.నారాయణపురం పంచాయతీ స్టాలిన్ నగర్‌లో గల రైతుసేవా కేంద్రంలో అన్నదాత సుఖీభవ-పీఎంకిసాన్ సొమ్ము రెండో విడత పంపిణీ చేపట్టారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. గత వైసీపీ ప్రభుత్వం పార్టీలు, వ్యక్తులను చూసి పథకాలను అందించిందన్నారు. అర్హులకు సైతం పథకాలను ఎగ్గొట్టిందన్నారు. అదే కూటమి ప్రభుత్వం పార్టీలకతీతంగా పథకాలను వర్తింపజేస్తోందన్నారు. చంద్రబాబు సీఎం కాగానే జిల్లాలో లక్ష ఎకరాలకు డ్రిప్ ఇచ్చారన్నారు. హార్టికల్చర్‌లో జిల్లాను దేశంలోనే నెంబర్ వన్‌గా మార్చారన్నారు. ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు కూడా ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. హంద్రీనీవా కాలువను వందరోజుల్లోనే వెడల్పు చేసి చూపించారన్నారు. అనంతరం నియోజకవర్గంలోని 371మంది రైతులకు సంబంధించిన రూ.24.73లక్షల అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ మెగా చెక్కును విడుదల చేశారు. అలాగే ఉచితంగా డ్రిప్పు, వ్యవసాయ పరికరాలను రైతులకు అందించారు. సబ్సిడీ ద్వారా వచ్చిన ట్రాక్టర్‌ను పంపిణీ చేశారు. కార్యక్రమంలో వ్యవసాయశాఖ ఏడీ రోజాపుష్పలత, ఏఓ వెంకటకుమార్, ఉద్యానశాఖ ఏడీ రత్నకుమార్, డిప్యూటీ ఎంపీడీఓ వెంకటనాయుడు, పంచాయతీ స్పెషలాఫీసర్ సురేష్, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ ఆదినారాయణ, టీడీపీ రాష్ట్రకార్యనిర్వాహక కార్యదర్శి ఆదెన్న, జిల్లా ఉపాధ్యక్షుడు డిష్‌నాగరాజు, తెలుగురైతు రాష్ట్ర కార్యనిర్వాహకకార్యదర్శి రఘు, మాజీ ఎంపీటీసీ వెంకటేష్, ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సభ్యుడు గంగారామ్, టీడీపీ రాష్ట్ర నాయకుడు సింగవరం రవి, శాలివాహనరాష్ట్రడైరెక్టర్ లక్ష్మీనరసింహులుతోపాటు పలువురు కార్పొరేటర్లు, మాజీ కార్పొరేటర్లు, నాయకులు పాల్గొన్నారు.

చంద్రన్నతోనే రైతుల అభ్యున్నతి: ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ

బుక్కరాయసముద్రం: సీఎం చంద్రబాబుతోనే రైతుల అభ్యున్నతి సాధ్యమని శింగనమల ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ అన్నారు. పీఎం కిసాన్ - అన్నదాత సుఖీభవ రెండో విడత నిధుల విడుదల సందర్భంగా మండలంలోని రెడ్డిపల్లి కృషివిజ్ఞాన కేంద్రంలో రైతుల సమావేశం జరిగింది. ఇందులో వ్యవసాయంలో విప్లవాత్మకంగా వచ్చిన మార్పులు, సాంకేతిక పనిముట్లపై ప్రదర్శన కూడా ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే హాజరై మాట్లాడారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం రైతులకు జవాబుదారీగా పనిచేస్తోందన్నారు. రైతుల సంక్షేమం, వ్యవసాయ అభివృద్ధికి సీఎం చంద్రబాబు అధిక ప్రాధ్యానత ఇస్తున్నారన్నారు. ప్రస్తుతం రాష్ట్రం అప్పుల్లో ఉన్నా.. రైతులకు అనేక పథకాలు, సబ్సిడీలు ఇస్తున్నారని తెలిపారు. పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించే విషయంలో సీఎం దృష్టికి తీసుకెళ్తామని ఆమె పేర్కొన్నారు. అనంతరం నియోజకవర్గంలో 54,338 మంది రైతులకు సంబంధించి రూ.36.70 కోట్ల అన్నదాత సుఖీభవ- పీఎంకిసాన్ మెగా చెక్కును విడుదల చేశారు. కార్యక్రమంలో కేవీకే ప్రధాన శాస్త్రవేత్త మల్లీశ్వరీ, జిల్లా టీడీపీ అధికార ప్రతినిధి పర్వతనేని శ్రీధర్‌బాబు, ఎంపీపీ సునీతతో పాటు టీడీపీ శ్రేణులు, పెద్దఎత్తున రైతులు పాల్గొన్నారు.

రైతులకు రుణ పరిమితి రూ.5లక్షలకు పెంపు

- సహకార వారోత్సవాల్లో చియ్యేడు సొసైటీ చైర్మన్ లక్ష్మీనారాయణ



చియ్యేడులో వర్మీకంపోస్టు ఎరువును రైతుకు అందజేస్తున్న సొసైటీ చైర్మన్ తదితరులు

అనంతపురం రూరల్, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): సహకార సొసైటీల ద్వారా రైతులకు గతంలో రూ.3లక్షల వరకు రుణం అందేదని, ప్రస్తుతం ఆ రుణాన్ని రూ.5 లక్షలకు పెంచినట్లు మండలంలోని చియ్యేడు సొసైటీ చైర్మన్ లక్ష్మీనారాయణ అన్నారు. 72వ అఖిల భారత సహకార వారోత్సవాలను సొసైటీ కార్యాలయంలో బుధవారం నిర్వహించారు.ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ.. రైతులకు రుణ పరిమితిని రూ.5 లక్షలకు పెంపు చేస్తూ ఇటీవల జీఓ విడుదల అయిందన్నారు. ఇందుకు సహకరించిన ఎమ్మెల్యే పరిటాల సునీత, ఏడీసీసీ బ్యాంకు చైర్మన్ ముంటిమడుగు కేశవరెడ్డి, సంబంధిత అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం రాఘవేంద్ర ఫార్మాసిటికల్ ఎడ్యుకేషన్ ఇన్‌స్టిట్యూట్ ఆధ్వర్యంలో రైతులకు వర్మీకంపోస్టు ఎరువులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో డైరెక్టర్లు సుధాకర్‌రెడ్డి, శ్రీరాములు, సంఘం మానిటరింగ్ అధికారి షర్వరాజ్ నవాజ్, సీనియర్ ఇన్‌స్పెక్టర్ మహబూబ్ దౌలా, సహకార విద్యాధికారి మురళీమోహన్, సీఈఓ రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

● రామగిరి: 72వ జాతీయ సహకార వారోత్సవాల్లో భాగంగా మండలకేంద్రంలోని సొసైటీ కార్యాలయంలో చైర్మన్ ముత్యాలప్ప సహకార పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం రైతులతో మాట్లాడుతూ సహకార సంఘాల బలోపేతానికి సహకరించాలని కోరారు. సీఈఓ శ్రీధర్, సబ్‌డివిజనల్ కో ఆపరేటివ్ అధికారి లీలావతమ్మ, డైరెక్టర్లు చంద్రాయుడు, నాగరాజు, సిబ్బంది, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి



శీనయ్య మృతదేహం

నార్పల, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): మండలంలోని బొందలవాడ గ్రామ సమీపంలో బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందారు. శ్రీసత్యసాయి జిల్లా చిలమత్తూరు మండలం కోడూరు గ్రామానికి చెందిన శీనయ్య (38) బైక్‌లో కూలిపనుల నిమిత్తం నార్పలకు వచ్చాడు. పనులు ముగించుకుని బుధవారం స్వగ్రామానికి బయలుదేరాడు. బొందలవాడ సమీపంలోకి రాగానే అతివేగంతో వచ్చిన ఐషర్ ఢీకొంది. ప్రమాదంలో శీనయ్య అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్ కానిస్టేబుల్ కుమార్ తెలిపారు.

వేడుకల్లో ఎమ్మెల్యేలు

అనంతపురం క్రైం, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): సత్యసాయి శత జయంతి వేడుకల్లో ఎమ్మెల్యేలు ఎమ్మెల్యేలు పరిటాల సునీత, దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్ పాల్గొన్నారు. సీఎం చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేష్‌ను ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధులు కలిశారు. అనంతపురం హిల్ వ్యూ స్టేడియంలో జరిగిన వేడుకల్లో పాల్గొన్నారు. డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌ను టీడీపీ రాష్ట్ర కార్యదర్శి రాయల్ మురళి మర్యాదపూర్వకంగా కలిశారు.



ప్రధానికి నమస్కరిస్తున్న ఎమ్మెల్యే పరిటాల సునీత



వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్

నేడు శింగనమలలో ప్రజాదర్బార్

శింగనమల, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో గురువారం ప్రజాదర్బార్‌ను నిర్వహించనున్నట్లు టీడీపీ మండల కన్వీనర్ గుత్తా ఆదినారాయణ బుధవారం ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటలకు కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ హాజరు కానున్నట్లు చెప్పారు. మండలంలోని గ్రామాల ప్రజలు ఏమైనా సమస్యలుంటే వచ్చి వినతిపత్రాల ద్వారా ఎమ్మెల్యేకు తెలియజేసి పరిష్కరించుకోవాలని సూచించారు.

నేడు కంటివైద్యశిబిరం

రామగిరి, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): మండలంలోని పేరూరులో జిల్లా అంధత్వ నివారణ సంస్థ, బెంగళూరు శంకర కంటి ఆస్పత్రి సంయుక్త సహకారంతో గురువారం ఉచిత కంటి వైద్యశిబిరాన్ని నిర్వహించనున్నట్లు నిర్వాహకుడు పేరూరు కోడిరామ్మూర్తి బుధవారం ప్రకటనలో తెలిపారు. స్థానిక పెద్దమ్మ ఆలయం వద్ద ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 1గంట వరకు ఈ శిబిరాన్ని నిర్వహించనున్నట్లు చెప్పారు. కంటి సమస్య ఉన్నవారు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

శకుంతలమ్మకు సీపీఐ నివాళి

అనంతపురంవిద్య, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): సీపీఐ నాయకురాలు శకుంతలమ్మకు ఆ పార్టీ నేతలు నివాళులర్పించారు. ఆమె వర్ధంతి సందర్భంగా నగరంలోని పార్టీ జిల్లా కార్యాలయంలో బుధవారం వారు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. పలువురు మాట్లాడుతూ.. పార్టీలో ఆమె చేసిన సేవల్ని గుర్తు చేశారు. సీపీఐ జిల్లా కార్యదర్శి పాళ్యం నారాయణ స్వామి,నాయకులు పద్మావతి, కేశవరెడ్డి, లింగమయ్య, రమణయ్య,చిరంజీవి,చంద్రకళ తదితరులు పాల్గొన్నారు.

ప్యాదిండిలో చోరీ

చెన్నేకొత్తపల్లి, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): మండలంలోని ప్యాదిండి గ్రామంలో ఓ ఇంటిలో గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. గ్రామానికి చెందిన మారుతీకుమార్ భార్యతో కలిసి దైవదర్శనానికి వెళ్లాడు. తిరిగి మంగళవారం అర్ధరాత్రి వచ్చి చూడగా తలుపులకున్న తాళం ధ్వంసం చేసి ఉండటాన్ని గమనించాడు. ఇంటిలోకి వెళ్లి చూడగా బీరువాను పగలకొట్టి అందులో ఉన్న దుస్తులు, ఇతర వస్తువులు చిందరవందరగా పడి ఉన్నాయి. బీరువాలో ఉంచిన రూ.20,500 నగదు, గ్యాస్ సిలిండర్, ఇతర సామగ్రిని చోరీ చేసినట్టు గుర్తించాడు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. చోరీ వివరాలను బాధితున్ని అడిగి తెలుసుకున్నారు. తర్వాత అతడి ఫిర్యాదు మేరకు...కేసునమోదు చేసుకుని విచారిస్తున్నారు.

రాష్ట్రస్థాయి బాస్కెట్‌బాల్ పోటీలకు ఎంపిక



ఎంపికైన విద్యార్థినులతో హెచ్ఎం, ఉపాధ్యాయులు

రామగిరి, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పేరూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన ఏడుగురు విద్యార్థులు రాష్ట్ర స్థాయి బాస్కెట్‌బాల్ పోటీలకు ఎంపికైనట్టు ఆ పాఠశాల హెచ్ఎం అరవింద తెలిపారు. ఎంపికైన విద్యార్థులను బుధవారం పాఠశాలలో ఉపాధ్యాయులు అభినందించారు. ఈ సందర్భంగా హెచ్ఎం మాట్లాడుతూ.. ఇటీవల అనంతపురంలో జరిగిన జిల్లా స్థాయి బాస్కెల్‌బాల్ అండర్-14,17,19 విభాగాలలో పాఠశాలకు చెందిన ప్రజ్వల, శ్రావ్య, వాణిశ్రీ, జ్యోత్స్న, రితిక, యశస్విని, కల్పన పాల్గొని ప్రతిభ కనబరచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు చెప్పారు. వీరు ఈ నెల 21, 22,23 తేదీలలో విజయవాడ, నూజివీడు, మదనపల్లిలో జరిగే రాష్ట్రస్థాయి బాస్కెట్‌బాల్‌పోటీలలో పాల్గొననున్నట్లు చెప్పారు. పీడీ వారాది తదితరులు పాల్గొన్నారు.

నిరాశ్రయులకు దుప్పట్ల పంపిణీ

అనంతపురం అర్బన్, నవంబరు19(ఆంధ్రజ్యోతి): సంజీవిని హెల్పింగ్ హ్యాండ్స్ సంస్థ వారు నగరంలోని నిరాశ్రయులకు దుప్పట్లు పంపిణీ చేశారు. బుధవారం రాత్రి పాతూరు, రైల్వే స్టేషన్, ఆర్టీసీ బస్టాండ్, కోర్టు రోడ్డు తదితర ప్రాంతాల్లో ఉంటున్న నిరాశ్రయులను గుర్తించి దుప్పట్లు అందజేశారు. ప్రస్తుతం చలి తీవ్రత అధికంగా ఉందని, దీంతో నిరాశ్రయులు ఇబ్బందులు పడకుండా ఉండేందుకు వీటిని పంపిణీ చేసినట్లు సంస్థ వ్యవస్థాపకుడు వీవీ రమణారెడ్డి తెలిపారు. సభ్యులు సూర్య, ఆది పాల్గొన్నారు.

నేడు కార్తీక అమావాస్య ఉత్సవం

బుక్కరాయసముద్రం, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): మండలంలోని బొమ్మలాటపల్లి గ్రామంలోగల ఎర్రితాత స్వామి ఆలయంలో గురువారం కార్తీక అమావాస్య ఉత్సవం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు బుధవారం ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా స్వామికి ప్రత్యేక పూజలు, ముత్యాల పల్లకి మహోత్సవంతో పాటు ఆలయంలో దిపోత్సవం నిర్వహించనున్నట్లు చెప్పారు. రాత్రి అఖండ భాగవత సప్తాహం, పఠన శ్రవణ యజ్ఞం చేయనున్నట్లు తెలిపారు.

దుర్గమ్మ ఆలయంలో ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు

రామగిరి, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): మండలంలోని నసనకోట సమీపంలో గల దుర్గమ్మ ఆలయంలో ఎమ్మెల్యే పరిటాల సునీత బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్తీక మాసంలో చివరిరోజు కావడంతో ఆమె ఆలయానికి వెళ్లి దుర్గమ్మ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేకపూజలు చేశారు. తర్వాత ఆలయ ప్రాంగణంలో కార్తీక దీపాలు వెలిగించి మొక్కులు తీర్చుకున్నారు. ఆమెతోపాటు పలువురు స్థానికులు పూజల్లో పాల్గొన్నారు.

పోక్సో చట్టంపై అవగాహన

అనంతపురం రూరల్, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): బుక్కరాయసముద్రం మండలం రేకులకుంట మండల ప్రజా పరిషత్ ప్రాథమిక పాఠశాలలో బుధవారం జేఎన్‌టీయూ ఓటీపీఆర్ఐ జాతీయ సేవా పథకం విభాగం ఆధ్వర్యంలో బాలలపై లైంగికపరమైన అకృత్యాలు, అత్యాచారాలను నిరోధించే పోక్సో చట్టం, ప్రస్తుత సమాజంలో మహిళల భద్రత అనే అంశంపై అవగాహన సదస్సు నిర్వహించారు. జిల్లా బాలల సంరక్షణ అధికారి నర్మద హాజరై అవగాహన కల్పించారు. మహిళ, శిశు సంరక్షణ విభాగం అధికారులు శాంతామని, కృష్ణమాచారి, మంజునాథ్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ లహరి పాల్గొన్నారు.

అనుమతిలేని కాలేజీలపై చర్యలు తీసుకోండి

అనంతపురం విద్య, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): నగరంలో ఎలాంటి అనుమతులు లేకుండా నడుస్తున్న జూనియర్‌కాలేజీలపై చర్యలు తీసుకోవాలని ఏఐఎస్ఎఫ్,ఎస్ఎఫ్ఐ నేతలు డిమాండ్ చేశారు. ఆవిద్యార్థి సంఘాలనాయకులు బుధవారం వేర్వేరుగా ఆర్ఐఓ అధికారులను కలిసి మాట్లాడారు. ఒకకాలేజీకి పర్మిషన్ తీసుకుని రెండు మూడు కాలేజీలను నిబంధనలకు విరుద్ధంగా నడుపుతున్నారన్నారు. అయినా ఎవరూ ఎలాంటి చర్యలు తీసుకోవడంలేదని మండిపడ్డారు. వెంటనే చర్యలు తీసుకోవాలన్నారు. లేదంటే ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. తర్వాత వినతి పత్రాలు అందజేశారు.

ఉన్నత చదువులకు అనుమతివ్వాలని వినతి

అనంతపురం విద్య, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): ఉన్నత చదువులు చదువుకోవడానికి ఎస్సీఎస్టీ టీచర్లకు అనుమతులు ఇవ్వాలని గిరిజన ఉపాధ్యాయసంఘం జిల్లా ప్రధానకార్యదర్శి రవీంద్రనాయక్ విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు బుధవారం ఆయన జిల్లాకేంద్రంలో డీఈఓ ప్రసాద్‌బాబును కలిసి మాట్లాడారు. ఎస్సీ ఎస్టీ ఇన్‌సర్వీస్‌టీచర్లు బీఈడీ, బీపీఈడీ కోర్సులు చేసుకోవడానికి అనుమతిస్తూ జీఓ 342 ఇవ్వడం జరిగిందన్నారు. ఇందుకోసం దరకాస్తు చేసుకున్న జిల్లాకు చెందిన పలువురి ఎస్సీఎస్టీ టీచర్ల దరకాస్తులను రాష్ట్రశాఖకు పంపగా తిరస్కరించారన్నారు. అవగాహన లేకనే ముందస్తుగా విద్యాశాఖ అనుమతి పొందలేకపోయారన్నారు. దీంతో ఆ అభ్యర్థులు ఆందోలన చెందుతున్నారని, వారికి ఉన్నత కోర్సులు చేసుకోవడానికి అనుమతులు మంజూరుచేయాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు.

అన్నదాతల హర్షం

కనగానపల్లి, నవంబరు19(ఆంధ్రజ్యోతి): అన్నదాత సుఖీభవ-పీఎం కిసాన్ పథకం ద్వారా రూ.7వేల నగదు ఖాతాల్లో జమ కావడంపై అన్నదాతలు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మండలకేంద్రంలోని రైతు ఎసీవీ రమణ అరటి తోటలో బుధవారం వారు టీడీపీ నాయకులతో కలిసి సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, ఎమ్మెల్యే పరిటాల సునీత చిత్రపటాలకు నవధాన్యాల అభిషేకం చేసి కృతజ్ఞతలు తెలిపారు. మార్కెట్ యార్డు చైర్మన్ బోయపాటి సుధాకర్ చౌదరి, టీడీపీ మండల కన్వీనర్ యాతం పోతలయ్య సర్పంచ్ అంకే రామకృష్ణ, తెలుగు యువత బట్టా సురేషచౌదరి, క్లస్టర్ ఇన్‌చార్జిలు పూజారి రాజాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

● ఆత్మకూరు: అన్నదాత సుఖీభవ ద్వారా రెండో విడత ఆర్థిక సాయం విడుదల కావడంతో మండలకేంద్రంలో రైతులు, టీడీపీ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా స్థానిక రైతు సేవా కేంద్రంలో ముఖ్యమంత్రి చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో మండలటీడీపీ కన్వీనర్ శ్రీనివాసులు, పార్లమెంట్ అధికార ప్రతినిధి శశాంక్ చౌదరి, నాయకుడు నరసింహచౌదరి తదితరులు పాల్గొన్నారు.

● నార్పల: మండల కేంద్రంలోని రైతు సహకార పరపతి సంఘం కార్యాలయ ఆవరణలో సింగిల్‌విండో చైర్మన్ ఉమామహేష్ నాయుడు పీఎం కిసాన్ నిధుల విడుదల ప్రత్యేక ప్రసారాన్ని వీక్షించేందుకు ఏర్పాట్లు చేశారు. రైతులు పెద్దఎత్తున తరలివచ్చి తిలకించి హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సొసైటీ చైర్మన్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం రైతు పక్షపాతి ప్రభుత్వమని అన్నారు.





కనగానపల్లిలో సీఎం, డిప్యూటీ సీఎం, ఎమ్మెల్యే చిత్రపటాలకు ధాన్యాభిషేకం చేస్తున్న నాయకులు, రైతులు.. ఆత్మకూరులో సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం

న్యూస్ బాక్స్

దిమ్మగుడిలో గ్రామసభ

పెద్దవడుగూరు, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): మండలంలోని దిమ్మగుడి గ్రామంలో ఎమ్మెల్యే జేసీ అస్మిత్‌రెడ్డి బుధవారం గ్రామసభ నిర్వహించారు. ఇందులో అధికారులు, సీనియర్ నాయకుడు ఎస్వీ రవీంద్రారెడ్డి, నార్త్‌కెనాల్ డిస్ట్రిబ్యూటర్ చైర్మన్ రాజారెడ్డి, టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు కేశవరెడ్డి, మండల కన్వీనర్ నాగేశ్వర్‌రెడ్డి, నాగరాజు పాల్గొన్నారు.

నాయకులతో సమావేశం

● తాడిపత్రి: ఎమ్మెల్యే జేసీ అస్మిత్‌రెడ్డి స్థానిక తన నివాసంలో మండల బూత్‌లెవల్ నాయకులతో బుధవారం సమావేశం నిర్వహించారు. ప్రతి నాయకుడు, కార్యకర్త గ్రామాల్లో పర్యటించి ప్రజా సమస్యలు గుర్తించి.. వాటిని పరిష్కరించాలన్నారు. అనంతరం తాడిపత్రి మండలంలోని చింబిలి వెంకటరమణ, నరేంద్రనాయుడు, యాడికి మండలం నుంచి వేలూరు రంగయ్య, రుద్రమనాయుడు, పెద్దవడుగూరు మండలం నుంచి ఆవులాంపల్లి కేశవరెడ్డి, రాజు పాల్గొన్నారు.

టీడీపీ నాయకుడి మృతి

పుట్లూరు, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): స్థానిక టీడీపీ సీనియర్ నాయకుడు, స్టోర్ డీలర్ బయపురెడ్డి (68) మంగళవారం రాత్రి గుండెపోటుతో మరణించాడు. ఆయన మృతదేహానికి మాజీ ఎమ్మెల్యే గుత్తా వెంకటనాయుడు, కమ్మ కార్పొరేషన్ డైరెక్టర్ సుదర్శన్‌నాయుడు, నాయకులు పుల్లారెడ్డి, సత్యనారాయణరెడ్డి, వెంకటనాయుడు, రామాంజనేయులు బుధవారం నివాళులర్పించారు.

● గుత్తి: గుత్తిఆర్ఎస్‌లోని సూరసింగనపల్లిలో నివాసముంటున్న టీడీపీ సీనియర్ నాయకుడు, మాజీ ఎంపీటీసీ పెద్దన్న(58) బుధవారం అనారోగ్యంతో మరణించాడు. ఆయన మృతదేహానికి టీడీపీ జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్, ఎమ్మెల్యే తనయుడు గుమ్మనూరు ఈశ్వర్, మార్కెట్ యార్డు చైర్మన్ ప్రతాప్ నివాళులర్పించారు.

కమిటీ ఎన్నిక

రాయదుర్గంరూరల్, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): స్థానిక కేటీఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏఐఎస్ఎఫ్ నియోజకవర్గ శాఖ సమావేశాన్ని బుధవారం నిర్వహించారు. ఏఐఎస్ఎఫ్ జిల్లా కోశాధికారి ఆంజనేయులు ఆధ్వర్యంలో నియోజకవర్గ నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా భానుప్రకాష్, ఉపాధ్యక్షులుగా మనోజ్, తరుణ్, ప్రధాన కార్యదర్శులుగా హరికృష్ణ, సహాయ కార్యదర్శులుగా సంతోష్, డేవిడ్, కోశాధికారిగా మధు.. 12మందితో కార్యవర్గాన్ని ఎన్నుకున్నట్లు తెలిపారు.

నీటి సరఫరా బంద్

రాయదుర్గంరూరల్, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): పట్టణానికి నీటి సరఫరాను గురువారం బంద్ చేస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ దివాకర్‌రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కణేకల్లు క్రాస్ వద్ద విద్యుత్ లైన్లు మార్పుతో విద్యుత్ సరఫరా ఉండకపోవడంతో.. నీటిని పంపింగ్ చేయుటకు వీలు కాదని, పట్టణ ప్రజలు తాగునీటిని పొదుపుగా వాడుకోవాలని సూచించారు.




కణేకల్లు: చెక్కు అందజేస్తున్న విప్ కాలవ, పామిడిలో చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే గుమ్మనూరు, టీడీపీ జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్

ఉద్యాన పంటలతో అధిక ఆదాయం

అన్నదాత సుఖీభవ-పీఎం కిసాన్ కార్యక్రమంలో కలెక్టర్ ఆనంద్

ఉరవకొండ, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): జిల్లా ఉద్యాన పంటలకు అనుకూలమని, ఆ పంటలను సాగు చేస్తే అధిక ఆదాయం పొందవచ్చని కలెక్టర్ ఆనంద్ రైతులకు సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయం ఆవరణంలో బుధవారం నిర్వహించిన అన్నదాత సుఖీభవ-పీఎం కిసాన్ కార్యక్రమంలో కలెక్టర్ రైతులకు చెక్‌ను పంపిణీ చేశారు. కలెక్టర్ మాట్లాడుతూ... అరటి ఎగుమతులకు సంబంధించి వ్యాపారులు, ఎగుమతుదారులతో ధరల నియంత్రణపై సమీక్షించామని, రైతులు పెట్టిన పెట్టుబడులు వచ్చేలా చర్యలు తీసుకుంటామని అన్నారు. జేడీఏ ఉమామహేశ్వరమ్మ మాట్లాడుతూ... జిల్లాలో అన్నదాత సుఖీభవ- పీఎం కిసాన్ పథకం కింద రెండో విడతలో 46,85,838 మంది రైతుల ఖాతాల్లోకి రూ.3,135.01 కోట్లు జమ చేశామన్నారు. కార్యక్రమంలో ఏడీ లక్ష్మానాయక్, ఏడీఏ సత్యనారాయణ, ఏఓ రామకృష్ణ, ఏపీఐడీసీ మాజీ డైరెక్టర్ దేవినేని పురుషోత్తం పాల్గొన్నారు.

● కణేకల్లు : స్థానికంగా నిర్వహించిన కార్యక్రమంలో ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు అన్నదాత సుఖీభవ చెక్కులను రైతులకు అందజేశారు. రాయదుర్గం నియోజకవర్గంలో దాదాపు 38,500 మంది రైతులకు రూ.29 కోట్లు మంజూరైనట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఓ జగదీష్, డీటీ విశ్వనాథ్, టీడీపీ నాయకులు హనుమంతరెడ్డి, వన్నారెడ్డి, లాలెప్ప, ఆనంద్‌రాజ్, షేక్‌ఫక్రుద్దీన్, సుదర్శన్, బీటీ రమేష్, చంద్రశేఖర్‌గుప్తా పాల్గొన్నారు.

● తాడిపత్రి: స్థానిక వ్యవసాయ కార్యాలయంలో అన్నదాత సుఖీభవ చెక్కులను ఎమ్మెల్యే జేసీ అస్మిత్‌రెడ్డి రైతులకు అందజేశారు. నియోజకవర్గంలోని 59, 206 మంది రైతులకు రూ.20.92 కోట్లు మంజూరైనట్లు తెలిపారు. ప్రతి రైతు ఫార్మర్ ఐడీ తప్పనిసరిగా చేయించుకోవాలని సూచించారు. మొక్కజొన్నల, పత్తి కొనుగోలు కేంద్రాలను త్వరలో ప్రారంభిస్తామన్నారు. బ్రాహ్మణపల్లికి చెందిన రైతుమిత్ర సంఘం గ్రూపునకు డ్రోన్ అందజేశారు. కార్యక్రమంలో వ్యవసాయశాఖ ఏడీ రవి, వ్యవసాయ అధికారులు పాల్గొన్నారు.

● పామిడి : స్థానిక ఎద్దులపల్లి రోడ్డు రెహమాన్ ఫంక్షన్ హాలులో అన్నదాత సుఖీభవ చెక్కులను గుంతకల్లు ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం, రాష్ట్ర కార్మిక సంక్షేమ బోర్డు చైర్మన్, టీడీపీ జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్ పంపిణీ చేశారు. నియోజకవర్గంలో 12 చెరువులను నీళ్లతో నింపామని, ఎన్నడూలేనివిధంగా ఎంపీఆర్ డ్యాంలో ఇప్పటికే నాలుగు టీఎంసీలు నీరు చేరిందని అన్నారు. పత్తి, కందులు, జొన్నలను గిట్టుబాటు ధరకే మార్కుఫెడ్ ద్వారా మార్కెట్ యార్డులో కొనుగోలు చేస్తామన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల ఇన్‌చార్జీ గుమ్మనూరు ఈశ్వర్, గుత్తి మార్కెట్ యార్డు చైర్మన్ జక్కలచెరువు ప్రతాప్, వైస్ చైర్మన్ కొట్టం మాలిక్ బాషా, పీ కొత్తపల్లి సహకార బ్యాంకు చైర్మన్ బొల్లు శ్రీనివాసరెడ్డి, రాష్ట్ర గిరిజన సహకార సంస్థ డైరెక్టర్ రమేష్ నాయక్ పాల్గొన్నారు.

● కళ్యాణదుర్గం: స్థానిక కృషి విజ్ఞాన కేంద్రంలో అన్నదాత సుఖీభవ చెక్కులను మార్కెట్ యార్డు చైర్‌పర్సన్ గోళ్ల లక్ష్మీదేవి రమేష్, టీడీపీ సీనియర్ నాయకులు మోరేపల్లి చౌళం మల్లికార్జున రైతులకు అందజేశారు. కళ్యాణదుర్గం నియోజకవర్గంలో 46,680 మంది రైతులకు రూ. 35.05 కోట్లు మంజూరైనట్లు తెలిపారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖ, కృషి విజ్ఞాన కేంద్రం అధికారులు, రైతులు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

● బెళుగుప్ప : స్థానిక పంచాయతీ కార్యాలయం వద్ద అన్నదాత సుఖీభవ కార్యక్రమాన్ని టీడీపీ జిల్లా కార్యదర్శి మల్లికార్జున ఆధ్వర్యంలో నిర్వహించారు. ఇందులో ఏవో పృథ్వీసాగర్, తహసీల్దార్ అనిల్ కుమార్, ఎంపీడీఓ లక్ష్మీనారాయణ నాయకులు పాల్గొన్నారు.




తాడిపత్రి : చెక్కును పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే జేసీ అస్మిత్‌రెడ్డి, కళ్యాణదుర్గం: చెక్కును విడుదల చేస్తున్న లక్ష్మీదేవి రమేష్, చౌళం మల్లికార్జున

ఉచిత శిక్షణ

ఉరవకొండ, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతీ, యువకులకు ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు ప్రిన్సిపాల్ అస్రఫ్ అలీ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మూడు నెలల పాటు శిక్షణ ఉంటుందని, ఇంటర్, డిగ్రీ, డిప్లొమా, 10తరగతి పూర్తి చేసినవా రు అర్హులని, శిక్షణ అనంతరం ఉద్యోగా లు కల్పించేలా తీసుకుంటామన్నారు. వివరాలకు 7013800115ను సంప్రదించాలన్నారు.

● తాడిపత్రి : స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఉన్న ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ శిక్షణా సంస్థలో జూనియర్ సాఫ్ట్‌వేర్ డెవలపర్ కార్యక్రమంలో భాగంగా ఉచిత కంప్యూటర్ శిక్షణ ఇస్తామని కళాశాల ప్రిన్సిపాల్ వెంకటనారాయణ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 24 నుంచి తరగతులు ప్రారంభమవుతాయని, ఇంటర్, డిగ్రీ అర్హత ఉండాలని, వివరాలకు 91330 04626ను సంప్రదించాలని సూచించారు.

ఏపీటీఎఫ్ సభ్యత్వ నమోదు

కుందుర్పి, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): మండలంలోని వివిధ పాఠశాలల్లో ఏపీటీఎఫ్ నమోదు కార్యక్రమాన్ని జిల్లా ఉపాధ్యక్షులు బొమ్మయ్య బుధవారం చేపట్టారు. 182 మంది ఉపాధ్యాయులు ఏపీటీఎఫ్ సంఘంలో సభ్యులుగా చేరినట్లు ఆయన తెలిపారు.

వైభవంగా కార్తీక దీపోత్సవం

బొమ్మనహాళ్, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): స్థానిక శ్రీరామదేవాలయంలో బుధవారం రాత్రి కార్తీక దీపోత్సవాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. యువతులు, మహిళలు ఆలయంలో దీపాలను వెలగించారు. ఆలయ ప్రాంగణంలో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఇందులో టీడీపీ నాయకులు పయ్యావుల మోహన్‌బాబు, అనిల్, లాలు స్వామి పాల్గొన్నారు.

టీడీపీ మండల కన్వీనర్ల నియామకం

పెద్దవడుగూరు/పెద్దపప్పూరు/యాడికి, నవంబరు19(ఆంధ్రజ్యోతి): టీడీపీ మండల కన్వీనర్లను ఎమ్మెల్యే జేసీ అస్మిత్‌రెడ్డి బుధవారం తాడిపత్రిలోని తన స్వగృహంలో బుధవారం ప్రకటించారు. పెద్దవడుగూరు మండల కన్వీనర్‌గా కాశేపల్లి గ్రామానికి చెందిన నాగేశ్వర్‌రెడ్డిని, పెద్దపప్పూరు కన్వీనర్‌గా ముచ్చుకోటకు చెందిన తాతిరెడ్డి లోకనాథ్‌రెడ్డిని, యాడికి కన్వీనర్‌గా యాడికి చెందిన దడియాల ఆదినారాయణను, కోకన్వీనర్‌గా కోనుప్పలపాడుకు చెందిన రామకృష్ణను నియమించారు. వీరిని పలువురు టీడీపీ నాయకులు, కార్యకర్తలు అభినందించారు.



నాగేశ్వర్‌రెడ్డి, లోకనాథ్‌రెడ్డి, ఆదినారాయణ

కాలువ పనుల పరిశీలన

కళ్యాణదుర్గం, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): కళ్యాణదుర్గం మండలంలోని బోరంపల్లి, కళ్యాణదుర్గం మున్సిపాలిటీలోని ఒంటిమిద్ది వద్ద జరుగుతున్న బీటీపీ ప్రాజెక్టు కాలువ పనులను హెచ్ఎన్ఎస్ఎస్ ఎస్ఈ స్వరూప్, టీడీపీ నాయకుడు దేవినేని అవినాష్ బుధవారం పరిశీలించారు. ఎస్ఈ మాట్లాడుతూ.. కాలువ పనులను ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు చొరవతో శరవేగంగా జరుగుతున్నాయన్నారు.



పనులను పరిశీలిస్తున్న ఎస్ఈ, అవినాష్

రాష్ట్రస్థాయి పోటీలకు నవ్య



శెట్టూరు, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): అనంతపురంలో మంగళవారం నిర్వహించిన జిల్లాస్థాయిలో డిస్కస్‌త్రో పోటీలో స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న నవ్య ప్రథమస్థానం సాధించింది. వినుగొండలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు హెచ్ఎం ఫిరోజ్‌ఖాన్ బుధవారం తెలిపారు.

వాలీబాల్ పోటీలకు బాబాఫక్రుద్దీన్

● కుందుర్పి: స్థానిక కేంద్ర ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బుధవారం నిర్వహించిన ఆంధ్రప్రదేశ్ స్కూల్ గేమ్స్ 2025 అండర్-14 వాలీబాల్ జిల్లాస్థాయి పోటీల్లో స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తొమ్మిదో తరగతి విద్యార్థి బాబా ఫక్రుద్దీన్ ప్రతిభ చాటాడు. దీంతో అతను రాష్ట్రస్థాయి పోటీలకు ఎన్నికైనట్లు ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు గోపీచంద్ తెలిపారు.



సైక్లింగ్ పోటీలో మంజునాథ ప్రతిభ



బొమ్మనహాళ్, నవంబరు19(ఆంధ్రజ్యోతి): గుంతకల్లు మండలం తిమ్మాపురంలో మంగళవారం నిర్వహించిన 69వ జిల్లాస్థాయి సైక్లింగ్ పోటీలో మండలంలోని నేమకల్లు హైస్కూల్‌లో పదో తరగతి విద్యార్థి మంజునాథ్ రెండో స్థానంలో నిలిచారు. మంజునాథ్‌ను ఎంఈఓ మల్లికార్జున, ఇన్‌చార్జీ ప్రధానోపాధ్యాయుడు రవిచక్రవర్తి, పీఈటీ భోగేష్, సర్పంచ్ పరమేష్, విద్యాకమిటీ చైర్మన్ హనుమంతప్ప బుధవారం అభినందించారు.

న్యాయం చేయండి

గుంతకల్లు టౌన్, నవంబరు 19 (ఆంధ్రజ్యోతి): కుల పెద్దలు పంచాయితీ చేసినందుకు డబ్బులు చెల్లించలేదని తనను, తన కుటుంబాన్ని కుల బహిష్కరణ చేశారని, దీంతో తన భర్త పిల్లలతో సహా ఎక్కడికో వెళ్లిపోయాడని, తనకు న్యాయం చేయాలని కథల వీధికి చెందిన కుళ్లాయమ్మ విజ్ఞప్తి చేసింది. స్థానిక కథల వీధిలో బుధవారం కుళ్లాయమ్మ తన కుటుంబ సభ్యులతో కలిసి మీడియాతో మాట్లాడారు. రమేష్ అనే వ్యక్తితో తనకు 15సంవత్సరాల క్రితం వివాహమైందని, నలుగురు పిల్లలు ఉన్నారని తెలిపారు. తనకు, తన భర్తకు గొడవలు వచ్చాయని, కుల పెద్దలు పంచాయితీ చేసేందుకు రూ.10 లక్షలు, పది తులాల బంగారు ఇవ్వాలని డిమాండ్ చేశారని, తాము ఇవ్వకపోవడంతో తనను, తన కుటుంబాన్ని కులం నుంచి వెలివేశారని వాపోయారు. దీంతో మూడు నెలల క్రితం తన రమేష్, పిల్లలను తీసుకుని ఊరు విడిచి వెళ్లిపోయాడని, తనకు తన భర్త, పిల్లలు కావాలని, ఈ విషయమై కలెక్టర్‌కు అర్జీ కూడా ఇచ్చానని తెలిపారు. తనకు న్యాయం చేయాలని లేకపోతే ఆత్మహత్యే శరణ్యం అని వాపోయింది.



మాట్లాడుతున్న కుళ్లాయమ్మ

పీహెచ్‌సీ తనిఖీ

ఉరవకొండ, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా ప్రోగ్రాం మేనేజ్‌మెంట్ ఆఫీసర్ శ్రీనివాస్‌రెడ్డి బుధవారం తనిఖీ చేశారు. జిల్లావ్యాప్తంగా ఈనెల 30వతేదీ వరకూ వైద్య సిబ్బంది ప్రతి ఇంటికీ వెళ్లి పరిక్షించి, కుష్టు వ్యాధి లక్షణాలు ఉన్న వారిని గుర్తించి వైద్య సౌకర్యాలు అందించాలన్నారు. ఆయన వెంట డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ అధికారి వేణు గోపాల్, వైద్యులు సర్దార్‌వలి, సీహెచ్‌వో లక్ష్మీదేవి, ఎంపీహెచ్ఈఓ గురుప్రసాద్, సూపర్ వైజర్ నాగశంకర్ ఉన్నారు.

రక్తదాన శిబిరానికి విశేష స్పందన



రక్తదాతకు సర్టిఫికెట్ అందజేస్తున్న సీఐ, నాయకులు

యాడికి, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): జర్నలిస్ట్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా బుధవారం యాడికిలో నిర్వహించిన రక్తదాన శిబిరానికి భారీ స్పందన లభించింది. విలేకరులు, స్థానికులు మొత్తం 58 మంది ఈ శిబిరంలో రక్తదానం చేసినట్లు యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రామచంద్రారెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి జోగిరెడ్డి తెలిపారు. కార్యక్రమంలో యాడికి సీఐ ఈరన్న, యూనియన్ జిల్లా అధ్యక్షుడు నాగేంద్రయాదవ్, సత్యసాయి జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులు, సభ్యులు బండారు బాలకృష్ణ, చంద్రశేఖర్‌రెడ్డి, ధనుంజయ, లయన్స్‌క్లబ్ సభ్యుడు కులశేఖర్‌నాయుడు పాల్గొన్నారు.

చౌడేశ్వరీదేవి జ్యోతుల ఉత్సవం



అలంకరణలో చౌడేశ్వరీదేవి



జ్యోతులతో భక్తుల ఊరేగింపు

యాడికి, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): యాడికిలోని మార్కెట్‌వీధిలోని చౌడేశ్వరిదేవికి జ్యోతుల ఉత్సవాన్ని బుధవారం తొగటవీరక్షత్రియులు ఘనంగా నిర్వహించారు. స్థానిక దేవర ఇంటి వద్ద నుంచి తొమ్మిది జ్యోతులను బస్టాండ్, పెద్దమ్మ ఆలయం, వైశ్యా వీధుల గుండా ఊరేగిస్తూ.. చౌడేశ్వరి దేవికి సమర్పించారు. పెద్దపప్పూరు, పెద్దవడుగూరు, ధర్మవరం, హిందూపురం, సోమందేపల్లి నుంచి భక్తులు జ్యోతుల ఉత్సవాన్ని తిలకించడానికి తరలివచ్చారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

చీనీ చెట్ల నరికివేత

యాడికి, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఓబులాపురంలో రైతు రంగస్వామికి చెందిన 69 చీనీచెట్లను బుధవారం గుర్తుతెలియని వ్యక్తులు నరికివేశారు. ప్యాపిలి మండలం గుట్లపల్లె గ్రామానికి చెందిన రంగస్వామి యాడికి మండలం ఓబులాపురం గ్రామంలోని తన తొమ్మిది ఎకరాల్లో చీనీచెట్లు సాగుచేశారు. చెట్లకు ఆరు సంవత్సరాల వయస్సు ఉండగా ప్రస్తుతం దిగుబడికి వచ్చాయి. మంగళవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు 69చీనీచెట్లను నరికివేశారు. బుధవారం ఉదయం ఈ విషయాన్ని గుర్తించిన రంగస్వామి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. యాడికి యుపీఎస్ సీఐ ఈరన్న నరికివేసిన చెట్లను పరిశీలించారు. సుమారు రూ.5 లక్షల మేర నష్టం వాటిల్లినట్లు బాధిత రైతు వాపోయాడు.

క్రీడాకారులకు అభినందన

పామిడి, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): కాకినాడలో ఈనెల 14 నుంచి 16వ తేదీ వరకూ నిర్వహించిన 39వ రాష్ట్ర స్థాయి తైక్వాండో, క్యోరుగి, పూమ్సే పోటీల్లో స్థానిక కృష్ణవేణి స్కూల్‌లో విద్యార్థులు ప్రతిభ చాటారు. తిరుపతి అభిరామ్, ఎస్‌కే షాకీర్ సిల్వర్ మెడల్స్ తలారి సత్య బ్రూస్లీ, తలారి సత్య గౌరవ్ లీ, నవనీత్, గోకుల్ కృష్ణ చరణ్ తేజ్, బనావత్ ఉమామహేశ్వరి, భవిష్య రెడ్డి, ఆస్పి యా ఐమాన్ బ్రాంజ్ మెడల్స్ సాధించారు. స్థానిక రహమత్ ఫంక్షన్ హాలులో బుధవా రం ఆ చిన్నారులకు గుంతకల్లు ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం, టీడీపీ జిల్లా అధ్య క్షుడు వెంకటశివుడుయాదవ్ అభినందించారు. కార్యక్రమంలో కోచ్ తులసిరామ్, ఆ స్కూల్ కరస్పాండెంట్ ఆర్ అనూరాధరెడ్డి, ఇన్‌చార్జీ శశికళ, పీఈటీ వెంకటరమణ పాల్గొన్నారు.

విద్యార్థినులకు సైకిళ్ల అందజేత

గుంతకల్లు టౌన్, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): స్థానిక సర్వేపల్లిరాధకృష్ణ మున్సిపల్ ఉన్నత పాఠశాలలో స్థానిక స్టేట్‌బ్యాంక్ మెయిన్ బ్రాంచ్ ఆధ్వర్యంలో కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీలో భాగంగా పది మంది పేద విద్యార్థినులను దాదాపు రూ. 50వేలు విలువ చేసే పది సైకిళ్ల బుధవారం పంపిణీ చేశారు. ఇందులో స్టేట్ బ్యాంక్ అనంతపురం రీజనల్ మేనేజర్ కే రమేష్‌బాబు, పాఠశాల హెచ్ఎం శ్రీనివాసులు, స్టేట్ బ్యాంక్ హెచ్ఆర్ సురేంద్ర, మేనేజర్ సందీప్, అసోసియేట్ నరేంద్ర, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఘనంగా ఝాన్సీలక్ష్మీబాయి జయంతి

పామిడి, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): ఝాన్సీ లక్ష్మీబాయి 197వ జయంతి సందర్భంగా స్థానిక పోలీసుస్టేషన్ వద్ద ఆమె విగ్రహానికి బీజేపీ నాయకులు, పలు పాఠశాలల విద్యార్థులు నివాళులర్పించారు. బీజేపీ మండల అధ్యక్షుడు అంజినాయక్, పట్టణ ప్రధాన కార్యదర్శి కుమార్, నాయకులు పత్రా శ్రీనివాసులు పాల్గొన్నారు.

పాఠశాలకు బెంచీల వితరణ



కార్యక్రమంలో పాల్గొన్న అభయ ఫౌండర్ బాలచంద్ర గురూజీ

ఉరవకొండ, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు అభయ ఫౌండేషన్ రీగల్ రెక్నార్డ్ సహాయంతో 200 బెంచీలను ఫౌండర్ బాలచంద్ర గురూజీ బుధవారం అందజేశారు. సత్యసాయి బాబా శత జయంతిని పురస్కరించుకుని ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో హెచ్ఎం సత్యనారాయణ, పాఠశాల కమిటీ చైర్మెన్, గోపాల్, ఉపాధ్యాయులు చంద్రశేఖర్ పాల్గొన్నారు.

నవరూప ఆంజనేయస్వామి గ్రామోత్సవం



గ్రామోత్సవంలో పాల్గొన్న మాలాధారులు

గుత్తి, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): గుత్తి ఆర్ఎస్‌లోని నవరూప ఆంజనేయస్వామి గ్రామోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. కార్తీక మాసం పురస్కరించుకుని సీతారాములు, ఆంజనేయస్వామికి గణపతి స్వాములకు పంచామృతాభిషేకం, అర్చన, హారతి నిర్వహించారు. అనంతరం ప్రత్యేక వాహనంలో ఆంజనేయ స్వామి ఉత్సవ మూర్తిని ఉంచి హనుమాన్, శివదీక్ష, భవానీ, అయ్యప్ప స్వామి దీక్షాపరులు గ్రామోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో అర్చకుడు గంగాధర్ స్వామి, బద్రీస్వామి పాల్గొన్నారు.

ఇప్పేరు చెరువు నుంచి నీటి విడుదల



నీటిని విడుదల చేస్తున్న నాయకులు, రైతులు

కూడేరు, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): ఇప్పేరు చెరువు నుంచి దిగువనున్న పి. నాగిరెడ్డిపల్లి గ్రామ చెక్ డ్యాంలకు బుధవారం నీటిని విడుదల చేశారు. పి.నాగిరెడ్డిపల్లిలోని బోరుబావుల్లో భూగర్భ జలాలు తగ్గిపోయాయని రైతులు, టీడీపీ నాయకులు మంత్రి పయ్యావుల కేశవ్ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో మంత్రి ఆదేశాల మేరకు ఇప్పేరు చెరువు నుంచి టీడీపీ నాయకులు నీటిని విడుదల చేశారు.

మోతాదుకు మించి మందులు వాడి వ్యక్తి మృతి

శెట్టూరు, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): మోతాదుకు మించి మందులు వాడటంతో శెట్టూరుకు చెందిన బోయ రామాంజినేయులు (73) మరణించాడు. అతను ఐదు సంవత్సరాలుగా షుగర్, బీపీ, మతిస్థిమితం కోసం ఆస్పత్రిలో చికిత్సలు చేయించుకునేవాడు. ఈ క్రమంలో మంగళవారం అనంతపురంలో ఒక ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స చేయించుకొని ఇంటికి వచ్చారు. బుధవారం ఆయన మతిస్థిమితానికి తీసుకోవాల్సిన మాత్రలు ఎన్ని వాడాలో తెలియక ఎక్కువ మోతాదుతో తీసుకోవడంతో అస్వస్థతకు గురయ్యాడు. కుటుంబసభ్యులు వెంటనే అతన్ని కళ్యాణదుర్గం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూఆయన మరణించాడు. అతని కుమారుడు బోయ చంద్ర ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

గుర్తుతెలియని వ్యక్తి ఆత్మహత్య

తాడిపత్రి, నవంబరు 19(ఆంధ్రజ్యోతి): మండలంలోని సజ్జలదిన్నె గ్రామ సమీపంలో బుధవారం రాత్రి ఒక వేపచెట్టుకు ఓ గుర్తుతెలియని వ్యక్తి ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు రూరల్ పోలీసులు తెలిపారు. చెట్టుపైభాగాన ఉరి వేసుకోవడంతో మృతదేహాన్ని ఇంకా కిందకు దించలేదని, మృతుడి వివరాలు తెలియాల్సి ఉందని తెలిపారు.